www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా వినికిడి తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -219 మంగళవారం 11 నవంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఢిల్లీ ఎర్రకోట వద్ద భారీ పేలుడు

- కారులో పేలుడు పదార్థాలను రిమోట్‌తో పేల్చివేత
- 8మంది మృతి..పలువురికి గాయాలు
- ఢిల్లీలో రెడ్ అలర్ట్ ప్రకటించిన పోలీసులు
- ముమ్మరంగా గాలింపు చర్యలు








## నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

- పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ

**హైదరాబాద్/నవంబర్10 ప్రజావినికిడి**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో మొత్తం 4 లక్షల 1,365 మంది ఓటర్లు ఉన్నారు. 58 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నాలుగు ఈవీఎంలను ఏర్పాటు చేశారు. మిగతా2లో...




## నేడు బీహార్‌లో రెండోదశ ఎన్నికలు

- 122 స్థానాలకు రెండో దశలో పోలింగ్
- అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**పాట్నా, నవంబర్ 10:** బీహార్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొదటి దశలో 121 స్థానాల్లో పోలింగ్ జరుగగా.. మిగిలిన 122 స్థానాలకు రెండో దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ దశలో మొత్తం 1302 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని పరీక్షించుకోను న్నారు. సుమారుగా 4 కోట్ల మంది ఓటర్లు వారి గెలుపోట ములను నిర్ధారించనున్నారు. రెండో దశలో భాగంగా పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామర్హి, మధుబని, సుపౌల్, అరేరియా, కిషన్‌గంజ్ తదితర జిల్లాల్లో పోలింగ్ జరుగనుంది. పోలింగ్ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 4 లక్షల మంది పోలీసులు, పారా మిలిటరీ బలగాలను ఇందుకు వినియోగించారు. మిగతా2లో...

## మాయమైన మనిషి అందెశ్రీ

- తిరిగిరాని లోకాలకు వెళ్లిన తెలంగాణ గొంతుక
- అస్వస్థతతో తెల్లవారు జామున కన్నుమూత
- తెలంగాణ గొంతుకగా పాటలతో ఉత్తేజ పరిచిన స్వరం
- తెలంగాణ గీతంగా అందెశ్రీ జయ..జయహే తెలంగాణ
- తీవ్ర విచారం వ్యక్తం చేసిన రేవంత్, కెసిఆర్, చంద్రబాబు
- పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం




## ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం

- గడువులోగా విచారించని స్పీకర్
- మరోమారు సుప్రీం గడప తొక్కిన బిఆర్ఎస్




**న్యూఢిల్లీ,/నవంబర్10 ప్రజావినికిడి** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఫిరాయింపు ఎమ్మెల్యే అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ముగిసినా, ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను త్వరగా విచారణకు స్వీకరించాలని అభ్యర్థించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై జూలై 31న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని మిగతా2లో...

## అత్యాధునికంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- శంషాబాద్ విమానాశ్రయం తరహాలో ఆధునీకరణ
- రూ.715 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు
- స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఏర్పాటు
- రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ప్రత్యేకంగా 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు ఏర్పాటు
- ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, /నవంబర్10 ప్రజావినికిడి** శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దుతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో అధునాతనంగా రూపుదిద్దుకోబోఓతోందని అన్నారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లోగా ఆధునీకరణ పూర్తవుతుందని అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం.. మీడియాతో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. రూ.715 కోట్లతో మిగతా2లో...



## ఎర్రకోట వద్ద పేలుడు ఘటన

- ఆరా తీసినా ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,/నవంబర్10 ప్రజావినికిడి:**ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు, ఈ పేలుడు ఘటనకు సంబంధించిన వివరాలను దిల్లీ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. సాయంత్రం 6.52 గంటలకు ఓ వాహనం ఎర్రకోట సమీపంలోని రెడ్ సిగ్నల్ వద్ద వచ్చి మిగతా2లో...


## అందెశ్రీ మృతికి పవన్ కళ్యాణ్ సంతాపం



**అమరావతి,/నవంబర్10 ప్రజావినికిడి** ప్రముఖ తెలుగు సాహితీవేత్త, గేయ రచయిత అందెశ్రీ మరణం బాధాకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ మిగతా2లో...

## విద్యారంగానికి పునాదులు వేసిన మౌలానా

- ఆజాద్ జయంతి సందర్భంగా స్మరించుకున్న రేవంత్



**హైదరాబాద్,/నవంబర్10ప్రజావినికిడి**భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. మౌలానా జయంతి సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. మహనీయుడి జయంతి రోజునే నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవం

మిగతా2లో...

## జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా మద్యం..డబ్బుల పంపిణీ

- ఆధారాలతో ఇసికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్
- చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్,/నవంబర్10ప్రజావినికిడి**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇష్టారాజ్యంగా మద్యాన్ని ప్రవహింపజేస్తూ, విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. లక్షకు పైగా చీరలు, మిక్సీ గ్రైండర్లను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. వీటన్నింటికీ సంబంధించిన ఫొటోలు, వీడియో ఆధారాలను ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించామని తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని

మిగతా2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఢిల్లీ ఎర్రకోట వద్ద భారీ పేలుడు

**న్యూఢిల్లీ, /నవంబర్10 (జర్నలిస్ట్ వార్త):** దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా 24 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. పేలుడు ధాటికి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. సోమవారం సాయంత్రం 6.55 గంటలకు పేలుడు సమాచారం అందినట్లు అగ్నిమాపక శాఖ ప్రకటించింది. ప్రమాదం అనంతరం ఏడు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. పేలుడు నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సహా క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకున్నాయి. ప్రమాదం అనంతరం స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. పేలుడు ధాటికి చుట్టుపక్కనే ఉన్న పలు కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. కారులో ఉంచిన పేలుడు పదార్థాలను దూరం నుంచి ఎవరైనా రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ప్రతి సోమవారం ఢిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు కావడంతో ప్రమాదం తీవ్రత తక్కువగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పేలుడు జరిగినప్పుడు నేను గురుద్వారా వద్ద ఉన్నాను. భారీ శబ్దం వినిపించింది. అదేంటో మాకు అర్థంకాలేదు. అంత పెద్దగా వినిపించింది. ఆ వాహనానికి సమీపంలో ఉన్న మరికొన్ని వాహనాలూ పూర్తిగా దగ్ధమయ్యాయ అని ఓ ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. 7 ఫైరిరజన్ల సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఫోర్స్ కూడా ఘటనా స్థలికి చేరుకుంది. పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది.

# మాయమైన మనిషి అందెశ్రీ





**హైదరాబాద్, /నవంబర్10 ప్రజావినికిడి** మనిషిన్న వాడు మాయమై పోయాడు. మానవ్వం ఉన్న చోటుకు తిరిగి రాకుండా పోయారు. పల్లె అన్నీ నేర్పిందన్న ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూశారు. 64 ఏండ్ల అందెశ్రీ కొతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి లాలాగూడలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గేయంగా గుర్తించింది. 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో అంటే ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్న రేబర్తిలో అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లన్న. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు' అనే పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అశు కవిత్వం చెప్పడంలో దిట్ట అయిన అందెశ్రీ.. ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'తోపాటు ఎన్నో పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కరం, లోక్‌నాయక్ పురస్కారం అందుకున్నారు. అందెశ్రీ ఆకస్మిక మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందన్నారు. అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామన్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ సీఎం సంతాపం వ్యక్తం చేశారు. కవి,రచయిత అందెశ్రీ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అందెశ్రీ మృతి పట్ల స్పీకర్ ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతి పట్ల భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతితి వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన సాంస్కృతిక ఉద్యమంలో అందెశ్రీ పాల్గొన్నారని గుర్తుచేశారు. తన పాటలతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. అందెశ్రీ మృతిపట్ల భారత రాష్ట్ర సమితి నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీకి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

# అత్యాధునికంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

(మొదటి పేజీ తరువాయి)

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. స్టేషన్‌ను 1.65 లక్షల చ.మీ మేర కొత్తగా నిర్మిస్తున్నాం. ఈ స్టేషన్‌కు నిత్యం 1.97లక్షల ప్రయాణికులు వస్తుంటారు. 2.70లక్షల మంది ప్రయాణికుల అవసరాలకు తగినట్లు నిర్మిస్తున్నాం. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాల్సి వస్తోంది. ఈ స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయి. రైల్వేస్టేషన్ కోసమే ప్రత్యేకంగా 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని కిషన్ రెడ్డి తెలిపారు. 5 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్‌లోపు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆధునిక సికింద్రాబాద్ స్టేషన్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాంఅని కిషన్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు కిషన్ రెడ్డి ప్రకటించారు. దక్షిణ భారత దేశంలోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొంటూ.. అమృత్ భారత్ పథకం కింద రూ. 714 కోట్లతో ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని, ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం 1,97,000 మంది ప్రయాణికులు రోజువారీగా ఈ స్టేషన్‌కు వస్తున్నారని, ప్రతి గంటకు సుమారు 23 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. పనుల వేగం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నూతన నిర్మాణాలలో భాగంగా సౌత్ మెయిన్ బిల్డింగ్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, ట్రావెలర్ తో కూడిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. సౌత్ సైడ్ బ్లాక్ నిర్మాణం రాబోయే నాలుగు నెలల్లో పూర్తి అవుతుందని, మొత్తం పునర్నిర్మాణ పనులను 13 నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్‌ను 3 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల మంది కూర్చునే విధంగా నిర్మిస్తున్నామని.. ఇది శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాదిరిగా అత్యాధునికంగా ఉండనుందని ఆయన పేర్కొన్నారు. నవీకరించబడిన స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు అందుబాటులోకి రానున్నాయి. అంతేకాకుండా, రెండు సబ్ స్టేషన్లు, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ సిస్టమ్, 5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఎలాంట్, 5 లక్షల లీటర్ల సీవేజ్ ట్రీట్‌మెంట్ ఎలాంట్ వంటి సదుపాయాలు ఉండనున్నాయి. రోజుకు 2,70,000 మంది ప్రయాణికులు వచ్చినా సేవలు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.

# జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా మద్యం..డబ్బుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్‌ను కోరామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి డబ్బులు పంపిణీ చేయడంపై హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో సీఈవో సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది పోలీసులు, ఇతర అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయారని విమర్శించారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా జూబ్లీహిల్స్ ఓటర్లు తెలివైన వారు అని.. తగిన రీతిలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న అన్ని విషయాలను ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలను ఈసీకి అందజేసి.. ఆయా బూత్‌ల్లో కేంద్ర బలగాలను పెట్టాలని కోరామన్నారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లను నియమించి, లోపలికి వెళ్లే ఓటర్ల ఐడెంటిటీని గుర్తించాలని.. ఆ తర్వాతే వారిని పోలింగ్ బూత్‌లోకి అనుమతించాలని కోరామని తెలిపారు. ఓటర్ ఐడీ గుర్తించకుండా ఓటర్లను పోలింగ్ బూత్‌లకు పంపించకూడదని సూచించారు. మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఈసీని కోరామని హరీశ్‌రావు తెలిపారు. చాలావరకు ఫేక్ ఓటర్ ఐడీలను తయారుచేశారని.. దానికి సంబంధించిన వీడియోను ఎన్నికల ప్రధాన అధికారికి సమర్పించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగం, ఫేక్ ఐడీ కార్డుల వివరాలను ఎలక్షన్ అబ్జర్వర్లకు కూడా అందజేశామని పేర్కొన్నారు. తొత్తులుగా మారిన అధికారులపై తప్పకుండా చర్యలు చేపడతామని సీఈవో హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేండ్లలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై రివ్యూ పెట్టలేదని.. ఇవాళ వాటిపై రివ్యూ పెట్టడం ఎందుకు అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# అందెశ్రీ మృతికి పవన్ కళ్యాణ్ సంతాపం

(మొదటి పేజీ తరువాయి)



జయ కేతనం' రచించి తెలంగాణ చరిత్రలో ఆయన చిరస్మరణీయంగా నిలిచారని కొనియాడారు. అందెశ్రీ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అందెశ్రీ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అందెశ్రీ హఠాన్మరణం దిగ్భ్రాంతి కలిగించిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆయన రచనా ప్రస్థానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొంటుందని తెలిపారు. గొర్రెల కాపరిగా, భవన నిర్మాణ కూలీగా జీవితం మొదలుపెట్టి అక్షర యాత్ర చేశారని అన్నారు. తెలంగాణ జానపదాలపై, మాండలికంపై పట్టు కలిగిన రచయిత ఆయన అని కొనియాడారు. పలు సినీ గీతాలు రచించారని.. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు?' గీతం వింటే సమాజాన్ని అందెశ్రీ ఎంతగా చదివారో అర్థమవుతుందని అన్నారు.

# నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలింపు పక్రియ మొదలైంది. సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రిని అధికారులు పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం కల్లా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలించనున్నారు. 3 వేల మంది పోలింగ్ సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో కలిపి మొత్తం 5 వేల మంది పోలీసులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల విధుల్లో ఉన్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల్లో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. ఈసారి డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ జరుగనుంది. 103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి.లయ్యాయి. సమస్యత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో భద్రత కట్టుదిట్టం చేయనున్నారు. 45 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 230 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. ఎంసీసీ నిబంధనలు అతిక్రమించిన 27 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా.. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపినాథ్ భార్య మాగంటి సునీత బరిలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీలో ఉన్నారు. మూడు ప్రధాన పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎలాగైన ఉప ఎన్నికలో గెలవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తీవ్రంగా కృషి చేశాయి. మరి జూబ్లీహిల్స్ ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారో చూడాలి.

# నేడు బీహార్‌లో రెండోదశ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే సిబ్బంది పోలింగ్‌కు అవసరమైన సామాగ్రితో సంబంధిత బూత్‌లకు చేరుకున్నారు.తొలి దశలో మాదిరిగా ఈ దిశలో కూడా నితీశ్ సర్కారులోని పలువురు మంత్రులు, ముఖ్య నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకో నున్నారు. ఈ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్, ఎన్డీయే కూటమిల మధ్యనే ప్రధాన పోటీ నెలకొని ఉంది. వీరితోపాటు కొత్తగా ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ, లాలూ యాదవ్ పెద్దకుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ నేతృత్వంలోని జన్‌శక్తి జనతాదళ్ పార్టీ బరిలో నిలిచాయి.

# ఎర్రకోట వద్ద పేలుడు ఘటన

(మొదటి పేజీ తరువాయి)

ఆగిందని, ఆ వెంటనే పేలుడు సంభవించిందని తెలిపారు. పేలుడు ధాటికి పలు వాహనాలకు మంటలు అంటుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా.. మరికొంత మంది గాయపడినట్లు చెప్పారు. దేశ రాజధాని నగరం ఢిల్లీలో ఎర్రకోట సమీపంలోని ఓ కారులో జరిగిన పేలుడు ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. పేలుడు ఘటన వివరాలను అమిత్ షాకు కమిషనర్ వివరించారు. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌ను హోంమంత్రి ఆరా తీస్తున్నారు. మరోవైపు, ఈ ఘటన తీవ్ర బాధాకరమని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై సమగ్రమైన, వేగవంతమైన దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అర్వింద్ కేజ్రివాల్ స్పందించారు. పేలుడు జరిగి కొందరు మృతిచెందినట్లు వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది చాలా బాధాకరమంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ పేలుడు ఎలా జరిగిందో, దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనేదానిపై పోలీసులు, ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేయాలని కోరారు.

# మరో పది కార్పోరేషన్లకు డైరెక్టర్లు

## • ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**అమరావతి, /నవంబర్1ప్రజావినికిడి** కూటమి ప్రభుత్వం మరో పది కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించింది. ఒక్కో కార్పొరేషన్‌కు దాదాపు 15 మంది చొప్పున డైరెక్టర్లను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. తెదేపాతోపాటు జనసేన, భాజపా నేతలకు కార్పొరేషన్ డైరెక్టర్లుగా ప్రాధాన్యత ఇచ్చింది. ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు, ఎస్సీ కమిషన్, మైనార్టీ కమిషన్, లేబర్ వెల్ఫేర్‌బోర్డు, కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కోమటి/కళింగ, వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు, దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ, ముదలియర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్, సగర/ఉప్పర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది.

# విద్యారంగానికి పునాదులు వేసిన మౌలానా

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించుకుంటున్నామని చెప్పారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణలతో పాటు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగాభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. మౌలానా ఆజాద్ స్ఫూర్తితో విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేశామని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని పేర్కొన్నారు. జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సీఎం కొనియాడారు. ఖిలాఫత్ ఉద్యమములో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకముగా పోరాడారని గుర్తు చేశారు. జాతీయోద్యమములో హిందూ ముస్లిం ఐక్యతను కోరుకొని దేశ విభజనను వ్యతిరేకించాడని తెలిపారు. స్వాతంత్యం అనంతరం మైనారిటీలకు గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ తన పిటిషన్‌లో గుర్తుచేసింది. అక్టోబర్ 31వ తేదీ లోపు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించిందని తెలిపింది. అత్యున్నత స్థానం ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొంది. దీంతో ఇంకా ఫిరాయింపు నేతలు ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారని చెప్పింది. అందుకే మరోసారి అత్యున్నత స్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పింది. ఈ విషయంలో ప్రొసీడింగ్స్ ఆలస్యం చేస్తే.. వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవచ్చని సుప్రీంకోర్టు గతంలోనే చెప్పిందని బీఆర్ఎస్ తెలిపింది. ఇంకా ప్రొసీడింగ్స్ ఎవిడెన్స్ స్టేజిలోనే ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ తరఫు న్యాయవాదులు తెలిపారు. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి రిటైర్ అయ్యేంతవరకు ఈ పక్రియను సాగదీయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ వాదనలు విన్న సీజేఐ.. నవంబర్ 24తో సుప్రీంకోర్టు ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. వచ్చే సోమవారం ఈ కేసు విచారణ జరుపుతామని తెలిపారు.

ప్రజాకవి అందే శ్రీ మృతి పట్ల సంతాపం చిత్ర పటానికి

## పూలమాలలు వేసి, నివాళులు అర్పించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా కవి అందే శ్రీ మృతి పట్ల ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్..ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్,పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య,కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ రెడ్డి, నేతలు అగ్గనూర్ బస్వ%శీ%,చెంది తిరుపతి రెడ్డి బాలరాజ్ గౌడ్,చంద్ర శేఖర్,శ్రీను నాయక్, ఖదీర్,ముబారక్ అలీ ఖాన్,శంకర్,రవితేజ, మహబూద్,మాధవలు యాదవ్, దిలీప్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆస్పత్రులను వెంటనే రెన్యూవల్ చేయాలి

**నర్సంపేట/నవంబర్ 10ప్రజావినికిడి**నర్సంపేట ప్రైవేట్ ఆస్పత్రులు రెన్యువల్ చెయ్యాలని విద్యార్థుల సంఘాల నాయకులు అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలు రెన్యువల్ కాకాసి.ఎం.ఆర్.ఎఫ్ బాధితులు ఇబ్బందులు పడుతున్న సందర్భంగా ప్రభుత్వం వెంటనే రెన్యూవల్ చేయాలని సోమవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఏ బి ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, ఎమ్మార్పీఎస్ కట్ల రాజశేఖర్ , ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు అజయ్, బి ఆర్ ఎస్ వి డివిజన్ కన్వీనర్ సదిరం వినయ్ మాట్లాడుతూ నర్సంపేట డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై నర్సంపేట వివిధ హాస్పటల్లో అడ్మిషన్ పొంది ట్రీట్మెంట్ తీసుకోగా అట్టి బాధితులు గత తొమ్మిది నెలల నుండి సీఎంఆర్ఎఫ్ నిధులు దరఖాస్తు చేసుకోక సంబంధిత హాస్పటల్ రెన్యువల్ కాకపోవడంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు రిజెక్ట్ కావడం జరుగుతుందని తెలిపారు.

# ఉత్తమ జర్నలిస్ట్ గా గిరిజన ఆణిముత్యం

## వార్తల సేకరణలో ముందంజ..

### హైదరాబాద్ లో అవార్డు అందుకున్న ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ తుర్స చంటి..





**ప్రజావినికిడి,(వెంకటాపురం): నవంబర్11,**
జర్నలిజం అంటే అంత సులువైనది కాదు,తెగించాలి, కష్టపడాలి,కష్టంతో పాటు సమయం కేటాయిస్తూ వార్తల సేకరణ చేయాలి అటువంటి వార్తల సేకరణ చేస్తున్న వారిని గుర్తిస్తూ హైదరాబాద్ ఈసీఐఎల్ లో జరిగిన ఎస్ ఆర్ సెవెన్ టీవీ జర్నలిస్టుల సమావేశంలో 2025 సంవత్సరానికి గాను ఉత్తమ జర్నలిస్టుగా ఏజెన్సీ ప్రాంతం నుంచి గిరిజన ఆణిముత్యం వార్తల సేకరణలో ముందంజలో ఉంటూ అవినీతి అక్రమాలను, ప్రజా సమస్యలను, ప్రభుత్వ పాలనను, అధికారుల పనితీరును,గిరిజన సమస్యలను, ఏజెన్సీలో గోదావరి వరదల సమయంలో నిత్యం వార్తల అందిస్తూ భద్రాచలం చర్ల,వెంకటాపురం, వాజేడు,రహదారుల పై వార్తలు తీస్తూ ప్రజాహితం కోరుతూ వార్తలను సేకరిస్తున్న వారికి అందించే ఉత్తమ జర్నలిస్టు అవార్డు ఈ ఏడాది తుర్స చంటి ని వరించింది,అయితే 2021లో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రకటించిన అవార్డులలో కూడా చంటి ఉండడం గమనార్హం,ఈ అవార్డు ఎస్ ఆర్ సెవెన్ టీవీ సీఈవో సర్వణన్ చంటి ని ప్రకటిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఇదే స్ఫూర్తి గా తీసుకొని ప్రతి జర్నలిస్టు వార్తలు సేకరించే విషయంలో పోటీ పడుతూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా అన్నారు,చంటి కి ఛానల్ వారు ప్రకటించిన ఉత్తమ జర్నలిస్టు అవార్డు రావడంతో తోటి జర్నలిస్టులు, విలేకరులు,గిరిజన సంఘాలు,ములుగు జిల్లా వెంకటాపురం,వాజేడు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజావాణిలో 29 ఫిర్యాదులు..

## ప్రజా సమస్యలపై అధికారులకు సి.నారాయణ రెడ్డి కలెక్టర్ దిశానిర్దేశాలు..






**ప్రజావినికిడి ,(రంగారెడ్డి):**
రంగా జిల్లా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 29 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్కి ప్రత్యక్షంగా వివరించి అర్జీలు సమర్పించారు.అందిన ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 13,ఇతర శాఖలకు సంబంధించినవి16 ఉన్నాయని అధికారులు తెలిపారు.కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజల వినతుల పరిష్కారమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశ్యం.అధికారులు అర్జీలను పెండింగ్లో పెట్టకుండా,సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.తరువాత ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,సంక్షేమ హాస్టల్స్,గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు.విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై రాజీ పడకూడదని, ప్రతిరోజూ తనిఖీలు చేయాలని సూచించారు.బాల్య వివాహాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.సంబంధిత అధికారులు గ్రామ స్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు.పత్తి,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అన్ని ప్రాంతాల్లో త్వరితగతిన ప్రారంభించి,రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ బాల్యవివాహాలను అరికట్టండి అనే పోస్టర్ను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ అధికారులు,మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# అందెశ్రీ మరణం యావత్ తెలంగాణకు తీరని లోటు

## కేశంపేట మాజీ జడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి





**ప్రజావినికిడి(షాద్ నగర్):**తెలంగాణ రాష్ట్ర గీతమైన “జయ జయ హే తెలంగాణ” రచయిత అందెశ్రీ ఆకస్మిక మరణ వార్త ఎంతో బాధాకరం అని అన్నారు కేశంపేట మాజీ జడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి..తెలంగాణ సాహితీ లోకానికి ఇది తీరని లోటు.మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన రాసిన గీతం ప్రజలలో చైతన్యాన్ని రగిలించి, అందరినీ ఒక్కతాటి మీదకు తీసుకువచ్చింది. ఆయన సాహితీ కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర గీతంగా “జయ జయ హే తెలంగాణ” ప్రకటించిన రోజున అందెశ్రీ కళ్లలో కనిపించిన ఆనందం,ఉద్విగ్నత నేటికీ తారసపడుతోంది. సాహితీ వనంలో మహావటవృక్షం కూలిపోయినంత బాధ ఈ రోజు మనందరిదీ. అందెశ్రీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను.

## గోల్డెన్ హెూమ్స్ సత్యదేవకి రెసిడెన్సి ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ వ్రతం



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**

కార్తీక మాసం సందర్భంగా గోల్డెన్ హెూమ్స్ సత్యదేవకి రెసిడెన్సి,జెడ్పి రోడ్ హస్తినాపురం,బిఎన్ రెడ్డి నగర్ నందు ఈరోజు సామూహిక సత్యనారాయణ వ్రతము అదేవిధంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ ఎంతో ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణా రాజు, ప్రధాన కార్యదర్శి నగేష్ మరియు ఇతర అసోసియేషన్ సభ్యులందరూ కలిసి భోజనం ఏర్పాట్లు చేస్తూ,ఘనంగా నిర్వహించారు.

## పేదల కళ్ళలో ఆనందం నింపడమే

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ - ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

### లబ్ధిదారులకు గృహప్రవేశం సందర్భంగా సంప్రదాయపరంగా బట్టలు పెట్టిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
పేదల కళ్ళలో సొంత ఇంటి కల నెరవేరిన ఆనందాన్ని చూస్తుంటే ఎంతో ముచ్చట వేస్తుందని ఇది ప్రజా ప్రభుత్వ విజయంగా భావిస్తున్నామని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు.షాద్ నగర్ మున్సిపాలిటీ 4వ వార్డులోని రాంనగర్ కాలనీలో స్థానిక కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకల్ల చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర స్థానిక నాయకులు ఆయన వెంట హాజరయ్యారు. డి.రమణ దేవి దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పట్టణ నాయకులతో కలిసి హాజరైన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ రిబ్బన్ కట్ చేసి లాంచనప్రాయంగా ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు బట్టలు సంప్రదాయపద్ధంగా పెట్టారు.స్వీట్ తినిపించి,శలువాతో సన్మానించి,కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,
షాద్ నగర్ నియోజకవర్గంలోని షాద్ నగర్. మున్సిపాలిటీ చటాన్ పల్లి 4వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.ఈ సందర్భంగా గృహప్రవేశం సందర్భంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో చేసిన పులిహెూరను ఎమ్మెల్యే ఆరగించారు.పచ్చగా పది కాలాలపాటు చల్లగా ఉండాలని దీవించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్,పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య,నాయకులు అగ్గనూర్ బస్వ%శీ%,చెంది తిరుపతి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందెశ్రీ కి ఘన నివాళి

**ప్రజావినికిడి,(షాద్ నగర్):** తెలంగాణ ప్రముఖ కవి,జయ జయ హే తెలంగాణ' ఉద్యమ గీత రచయిత డా. అందెశ్రీ మరణం పట్ల సంతాపం తెలుపుతూ సోమవారం రోజు స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఫరూఖ్ నగర్ మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ,

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత,ప్రముఖ ప్రజాగాయకుడు శ్రీ అందేశ్రీ గారి అకాల మరణం తీవ్రదిగ్భ్రాంతిని గురిచేసింది,తెలంగాణ ఆవిర్భావంలో ఆయన రచనలు,గానం కీలక పాత్ర పోషించాయి. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని వెంకట్ రాంరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత,ప్రముఖ ప్రజాగాయకుడు శ్రీ అందేశ్రీ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని గురిచేసింది అని అన్నారు

తెలంగాణ ఆవిర్భావంలో ఆయన రచనలు,గానం కీలక పాత్రపోషించాయి. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని తెలంగాణ ఉద్యమంలో తన అక్షరాన్ని ఇంధనంగా మార్చి ప్రజల్లో నిత్య చైతన్యాన్ని జ్వలింపచేసిన గొప్ప యోధుడు అందెశ్రీ అని అన్నారు,అందెశ్రీ మరణం



తెలంగాణ సమాజానికి తీరనిలోటని, తెలంగాణ ఆటపాట ఉన్నంతకాలం అందెశ్రీ ఉంటాడని,ఆయన అందించిన జయ జయహే తెలంగాణ పాట తెలంగాణ సమాజ సహజత్వాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు,నిత్యం పేదల పక్షాన గొంతుక వినిపించిన నిస్వార్థ తెలంగాణ మట్టి మనిషి.

అందెశ్రీ భౌతికంగా మన మధ్య లేకపోయినా తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతమైన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" గేయంగా నిత్యం ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారు అని వెంకట్ రాంరెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,మండల అధ్యక్షుడు దొడ్డి రవీందర్,నేతలు రవి కుమార్ గౌడ్,అదెట్ల రాజు,మేకల వెంకటేష్,రావుఫ్, రాఘవేందర్,ఆదిత్య రెడ్డి,తంగెడ్పల్లి శంకర్,జువ్వ సుధాకర్,మధసి కుర్వ సంఘం నేత డాక్టర్ విఠల్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో హై అలర్ట్..!

**ఢిల్లీ ఘటన నేపథ్యంలో షాద్ నగర్ లో నాకబంది..**

**వాహనాలను ప్రత్యేక తనిఖీ చేసిన పోలీసులు..**

**షాద్ నగర్ సిఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు..**

**బస్ స్టేషన్, లాడ్జింగ్ లు,తదితర పబ్లిక్ ప్రదేశాలలో విస్తృత తనిఖీలు..**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**


దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుళ్లు సంభవించిన నేపథ్యంలో హైదరాబాద్ తోపాటు పలు జంట నగరాలు, శివారు పోలీస్ స్టేషన్లను రాష్ట్ర పోలీసు శాఖ అప్రమత్తం చేసింది. దేశంలోని ప్రధాన నగరాలలో ఒకటైన హైదరాబాద్ కు కూడా కేంద్రం హెచ్చరికలు జారీ చేయడంతో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హైవే లతోపాటు పలు ముఖ్యమైన రహదారులలో పోలీసులు నాకాబంది నిర్వహిస్తున్నారు. షాద్ నగర్ పట్టణ



ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తదితరులు వాహనాల తనిఖీలను ప్రత్యేకంగా చేపట్టారు. డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ తోపాటు మరికొంతమంది ఎస్ఐలు,పోలీసు సిబ్బంది వాహనాల ఈ తనిఖీలు చేపట్టారు. బస్ స్టేషన్,లాడ్జింగ్ లు,తదితర పబ్లిక్ ప్రదేశాలలో విస్తృత తనిఖీలు చేపట్టారు.

పోలీసులు అప్రమత్తం కావడంతో విస్తృత తనిఖీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరించిన ఇంకా ఏమైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందజేయాలని సిఐ విజయ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో అప్రమత్తమై శాంతిభద్రతల పటిష్టతకు అన్ని చర్యలు తీసుకున్నట్లు సీఐ విజయ్ కుమార్ తెలిపారు.







# పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ

## సైబర్ మోసాల గురించి హెచ్చరిక

హైదరాబాద్,**నవంబర్10ప్రజావినికిడి:**

పింఛనుదారులు తమ వార్షిక డిజిటల్ జీవన ప్రమాణ పత్రం లైఫ్ సర్టిఫికెట్ సమర్పణలో జాగ్రత్తలు పాటించాలని కేంద్ర ప్రభుత్వ పింఛను, పింఛనర్ల సంక్షేమ విభాగం సూచించింది. నవంబర్ 1 నుంచి 30 వరకు జరుగుతున్న 'డీఎల్‌సీ క్యాంపెయిన్ 4.0'లో భాగంగా లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ కొనసాగుతోంది. ఈ పక్రియలో సైబర్ మోసాలకు గురయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది. ఇటీవల హైదరాబాద్‌లోని బర్కత్‌పురలో నివసించే విశ్రాంత ఉద్యోగి ఇలానే సైబర్ మోసానికి గురయ్యారు. లైఫ్ సర్టిఫికెట్ కోసం 'ఏపీకే' ఫైల్ పంపించి, ఇన్‌స్టాల్ చేయించిన సైబర్ నేరగాడు బాధితుడి ఖాతా నుంచి రూ.12.99 లక్షలు కొట్టేశాడు. ఈ నేపథ్యంలో పింఛన్‌దారులు తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా సూచనలను కేంద్రం విడుదల చేసింది. జీవన్ ప్రమాణ్ పత్రాన్ని అధికారిక వెబ్‌సైట్, పోస్టాఫీస్ యాప్ లేదా ఆధార్ ఫేస్ ఆర్‌డీ యాప్ ద్వారా మాత్రమే సమర్పించాలి. గుర్తు తెలియని ఏజెంట్లు లేదా అనధికారిక యాప్‌ల ద్వారా వ్యక్తిగత వివరాలు ఇవ్వకూడదు. ఆధార్ నంబర్, ఓటీపీ, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పీపీఓ నంబర్, మొబైల్ నంబర్‌ను ఎప్పుడూ అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించింది. ప్రభుత్వ సంస్థలు



ఎప్పుడూ ఫోన్ లేదా ఇ-మెయిల్ ద్వారా పాస్‌వర్డ్, ఓటీపీ, బ్యాంక్ పిన్ వంటి వివరాలు అడగవు. ప్రభుత్వం పేరిట వచ్చే ఈమెయిళ్లు, మెసేజ్‌లను తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలి. ఫోన్‌లు, కంప్యూటర్లు తాజా సెక్యూరిటీ ప్యాచ్‌లు, యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌లతో అప్‌డేట్ చేయాలి. లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ సమయంలో సురక్షితమైన వైఫై లేదా మొబైల్ నెట్‌వర్క్ ఉపయోగించండని అన్నారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు వార్షిక జీవిత ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. 80 ఏళ్లు పైబడిన సూపర్ సీనియర్ సిటిజన్లయితే అక్టోబర్ 1 నుంచే సమర్పణకు అనుమతి ఉంది. దీనిని సబ్మిట్ చేసిన తర్వాతే పెన్షన్ పంపిణీ చేసే ఏజెన్సీలు పెన్షన్‌ను బ్యాంక్ అకౌంట్‌లో వేస్తాయి. లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, పీపీఓ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్, పెన్షన్ ఇష్యూ చేసే అథారిటీ పేరు వంటి వివరాల్ని సిద్ధం చేసుకోవాలి.

# ఢిల్లీ పేలుళ్ల ఘటనతో అలర్ట్

## హైదరాబాద్‌లో హైలర్ట్ ప్రకటించిన పోలీసులు

**హైదరాబాద్,నవంబర్10ప్రజావినికిడి:**



ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుతో దేశ రాజధాని దిల్లీలో అలజడి రేగింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద కారులో పేలుడు సంభవించి.. 8 మంది మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఎర్రకోట పరిసర ప్రాంతాల్లో భీతావహ వాతావరణం నెలకొంది. దీంతో ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించారు. ఎన్ఐఏ బృందాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో దిల్లీ సహా పలు నగరాలను కేంద్ర హోం శాఖ అప్రమత్తం చేసింది. ముంబయి, హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు తదితర నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు, ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ముమ్మర తనిఖీలు సాగిస్తున్నారు. దిల్లీ పేలుళ్ల దృష్ట్యా నగరంలో అలర్ట్ ప్రకటించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. పలుచోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

--------

# ప్రైవేట్ ఆస్పత్రికి వినియోగదారుల ఫోరం షాక్

## గర్భిణి మృతికి కారణమైనందుకు కోటి పరిహారం చెల్లించాలని ఆదేశం



నల్లగొండ,**నవంబర్10ప్రజావినికిడి:** నార్కట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యానికి నల్గొండ జిల్లా వినియోగదారుల ఫోరం బిగ్ షాక్ ఇచ్చింది. ఓ మహిళకు నిర్లక్ష్యంగా వైద్యం చేసి, ఆమె ప్రాణాలు బలిగొన్న కేసులో బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని ఆదేశించింది. నెల రోజుల్లో ఆ డబ్బు చెల్లించకపోతే 9శాతం వడ్డీతో ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన స్వాతిని 2018 జులై 9న డెలివరీ కోసం కుటుంబ సభ్యులు నార్కట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. జులై 13 రాత్రి ఆమెకు సర్జరీ చేసిన వైద్యులు.. రెండు సార్లు మత్తు మందు ఇవ్వడంతో వైద్యం వికటించి.. 14న స్వాతి మృతి చెందారు. దానిని కప్పిపుచ్చుకునేందుకు వైద్యులు సినిమా రేంజ్‌లో సీన్ క్రియేట్ చేసి.. తమ తప్పులేదని నిరూపించు కునేందుకు ప్రయత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా.. పలుమార్లు విచారణ చేపట్టిన ఫోరం తాజాగా తీర్పు వెలురించింది.

# రాత్రి వేళల్లో వెచ్చని బట్టలు ధరించాలి.




**నవంబర్10ప్రజావినికిడి:** కొన్ని రోజులుగా చలి తీవ్రత పెరిగి ప్రజలు వణుకుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో వాతావరణం మరింత చల్లబడింది. ఉద్యోగాలు పాఠశాలలు వెళ్లేవారికి చాలా ఇబ్బంది అవుతోంది ఉత్తర దిశ నుంచి చల్లని గాలులు వీస్తుండడంతో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితి ఇంకా కొన్ని రోజులు కొనసాగవచ్చు అని వాతావరణం శాఖ వారు హెచ్చరించారు

**జాగ్రత్తలు తీసుకోవాల్సినవి:** ఉదయం రాత్రి వేళల్లో వెచ్చని బట్టలు ధరించాలి. పిల్లలు వృద్ధులు గర్భిణీలు బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి వేడి నీరు తాగడం ఆవిరి పీల్చడం అలవాటు చేసుకోవాలి శీతాకాలానికి తగిన ఆహారం పప్పులు సూప్‌లు వేడి పానీయాలు తీసుకోవాలి. చలి ఎక్కువగా ఉన్న సమయాల్లో అనవసరంగా బయట తిరగకూడదు. ఈ కాలంలో జలుబు, దగ్గు, ఫీవర్ వంటి సమస్యలు ఎక్కువగా వస్తాయి. శరీరాన్ని వేడి ఉంచడం పరిశుభ్రత పాటించడం ద్వారా ఈ సమస్యలను నివారించవచ్చు.

# కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్..

## ఆ సెక్షన్లు కేసుకు సరిపోలడం లేదన్న హైకోర్టు



**హైదరాబాద్: నవంబర్10ప్రజావినికిడి:**

హైదరాబాద్ నగరంలోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్లు ఈ కేసుకు సరిపోవడం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకే కేసు నమోదు చేసినట్లు పోలీసుల తరఫు న్యాయవాది వాదించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అమరవీరుల స్మారకం వద్ద గోరటి వెంకన్నను కేటీఆర్ ఇంటర్వ్యూ చేశారని, అందులో బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూరేలా అంశాలు ఉన్నాయని వాదనలు వినిపించారు. అంతేకాకుండా, అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారని తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు, ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్లు ప్రస్తుత కేసుకు సరిపోవడం లేదని వ్యాఖ్యానిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది

## మంత్రులను ప్రశంసించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, నవంబర్10ప్రజావినికిడి:**
ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మొంథా తుపాను సహాయక చర్యలపై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా తుపాను సమయంలో క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి, ప్రజలకు అండగా నిలిచిన మంత్రులను, అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. అందరి సమష్టి కృషితోనే పెను నష్టాన్ని నివారించగలిగామని ఆయన ప్రశంసించారు.మొంథా తుపాను సమయంలో ప్రతి మంత్రి తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే ఉండి, సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించడం వల్ల ప్రజలకు వేగంగా సేవలు అందాయని సీఎం పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే సహాయక కార్యక్రమాలు అత్యంత వేగంగా జరిగాయని తెలిపారు. ఈ సమష్టి కృషే మంచి ఫలితాలను ఇచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు.అదే సమయంలో టెక్నాలజీ వినియోగంపై కూడా చంద్రబాబు మాట్లాడారు. ఆర్టీజీ (రియల్-టైమ్ గవర్నెన్స్) సెంటర్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామని వివరించారు. మంత్రులు, అధికారులు ఒక బృందంగా (టీం స్పిరిట్‌తో) పనిచేయడం తాను ప్రత్యక్షంగా గమనించానని, వారి కష్టానికి అభినందనలు అని చంద్రబాబు పేర్కొన్నారు.


# ధాన్యం కొనుగోలుపై మంత్రి నాదెండ్ల సమీక్ష...

## గోడౌన్లు సిద్ధం చేయాలని ఆదేశం



**అమరావతి, నవంబర్10ప్రజావినికిడి:**
2025%-%26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిల్వపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ధాన్యం సేకరణ అనంతరం బియ్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గోడౌన్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబరులో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ఏడాది కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ ధాన్యం కొనుగోళ్లలో చారిత్రాత్మక విజయం సాధించిందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈ సీజన్‌లో కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖకు 20 లక్షల మెట్రిక్ టన్నులు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కు 14 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సీఎంఆర్ బియ్యాన్ని నిల్వ చేసేందుకు గోడౌన్లను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ధాన్యం మిల్లింగ్, నిల్వ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రైయర్ల సౌకర్యం ఉన్న రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అక్రమాలకు తావులేకుండా ప్రతి గోడౌన్ వద్ద నిరంతర నిఘా కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, జిల్లాల వారీగా రైస్ మిల్లర్లు 1:2 నిష్పత్తిలో బ్యాంక్ గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు సుమారు 35 బ్యాంకులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సూరిబాబు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. సివిల్ సప్లైస్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

## తిరుమల అన్నప్రసాదంపై నా వ్యాఖ్యలను వక్రీకరించారు: మీడియాపై అంబటి ఫైర్




**అమరావతి,నవంబర్10ప్రజావినికిడి:**
వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు, తిరుమల అన్నప్రసాదంపై తాను చేసిన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి ప్రసారం చేశాయంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భగవంతుడిపై భక్తితో తాను చేసిన వీడియోను రాజకీయాలకు వాడుకోవడంపై మండిపడ్డ ఆయన, ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అంబటి రాంబాబు, అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భోజనం చేశారు. అక్కడి ఏర్పాట్లు, భోజన నాణ్యత చూసి ఆయన ముగ్ధులయ్యారు. రోజుకు సగటున 90 వేల మందికి, కొన్ని ప్రత్యేక రోజుల్లో లక్షన్నర మందికి కూడా ఎంతో శుచిగా, రుచికరంగా భోజనం అందించడం అద్భుతమని ప్రశంసించారు. ఈ అనుభవాన్ని వివరిస్తూ తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ వీడియోను కూడా పోస్ట్ చేశారు.అయితే ఏబీఎన్, టీవీ5, మహా టీవీ వంటి కొన్ని ఛానళ్లు తన వీడియోలోని క్లిప్పింగులను తీసుకుని, దానికి రాజకీయ రంగు పులిమాయని అంబటి ఆరోపించారు. తాను కేవలం "అన్నప్రసాదం చాలా బాగుంది" అని మాత్రమే అన్నానని, కానీ ఆ ఛానళ్లు మాత్రం "గతంలో కంటే ఇప్పుడు బాగుంది" అని తాను అన్నట్లుగా ప్రచారం చేశాయని మండిపడ్డారు. ఈ విధంగా తన ప్రశంసలను ప్రస్తుత టీటీడీ బోర్డుకు, దాని ఛైర్మన్ బీఆర్ నాయుడుకు ఆపాదిస్తూ ఆ మీడియా సంస్థలు 'శునకానందం' పొందుతున్నాయని తీవ్రస్థాయిలో విమర్శించారు.

# ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ..

## పవన్ కల్యాణ్ పనితీరును ప్రశంసించిన సీఎం చంద్రబాబు

**సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ మంత్రివర్గ సమావేశం**

**మామండూరు అటవీప్రాంతం, ఎర్రచందనం డిపో సందర్శన వివరాలు పంచుకున్న పవన్**

**పవన్ చొరవను ప్రత్యేకంగా ప్రస్తావించిన సీఎం చంద్రబాబు**

**కేబినెట్ సమావేశంలో 70 అంశాలపై చర్చ**

**పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం**



**అమరావతి, నవంబర్10ప్రజావినికిడి:**
ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, సహచర మంత్రులు ప్రశంసలు కురిపించారు. పవన్ పనితీరు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని అభినందించారు. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన క్యాబినెట్ భేటీలో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల మామండూరు అటవీ ప్రాంతంతో పాటు మంగళంలోని ఎర్రచందనం డిపోను సందర్శించిన వివరాలను పవన్ కల్యాణ్ నేటి మంత్రివర్గ సమావేశంలో పంచుకున్నారు. వైసీపీ నేత పెద్దిరెడ్డి ఆక్రమణలపై ఆధారాలతో వీడియోలు తీయించానని తెలిపారు. సందర్భంగా ఆయన చొరవను, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న తీరును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో ఏవైనా పరికరాలు చేద్దామని చంద్రబాబు ప్రతిపాదించారు.
సోమవారం సుమారు మూడున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో దాదాపు 70 అజెండా అంశాలపై కూలంకషంగా చర్చించారు. పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా, వివిధ సంస్థలకు భూముల కేటాయింపుపై సీఆర్‌డీఏ తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రివర్గం సమర్థించింది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు భూ కేటాయింపుల్లో ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని నిర్ణయించింది. రెవెన్యూ శాఖలో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు పచ్చజెండా ఊపింది.సమావేశం అనంతరం మంత్రులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు, ఇటీవల సంభవించిన మొంథా తుపాను సమయంలో యంత్రాంగం అద్భుతంగా పనిచేసిందని కొనియాడారు. మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు అండగా నిలవడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్టీజీఎస్) ద్వారా నిరంతరం పర్యవేక్షించడం సత్ఫలితాలనిచ్చిందని అన్నారు. సమన్వయంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని, ఆ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు.
ఈ సందర్భంగా పేదలందరికీ ఇళ్లు అందించే బాధ్యతను మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నివాస స్థలం లేని వారి జాబితాలను సిద్ధం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

## మీడియా రిలేషన్స్ పోర్టల్ ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కొలుసు పార్థసారథి

**-2026-2027 రెండేళ్ళ కాలానికి అక్రిడిటేషన్లు జారీ**

**-మీడియా సంస్థల నుండి ధరఖాస్తులు ఆహ్వానం**



**అమరావతి,నవంబర్10ప్రజావినికిడి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు 2026-2027 రెండేళ్ళ కాలపరిమతితో కూడిన అక్రిడిటేషన్లు జారీ చేసేందుకు సంబంధించి మీడియా రిలేషన్స్ పోర్టల్(వైబ్ సైట్)ను సోమవారం సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి లాంచనంగా ప్రారంభించారు. ఈమేరకు ఎపి సచివాలయం ప్రచార విభాగంలో జరిగిన మీడియా సమావేశంలో మీడియా రిలేషన్స్ వెబ్ సైట్ ను సమాచారశాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాధన్ తోకలిసి ప్రారంభించారు.గతంలో జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ఈనెల 30వ తేదీతో ముగియనున్న నేపధ్యంలో రానున్న 2026-2027 రెండేళ్ల కాలానికి నూతన అక్రిడిటేషన్లు జారీకి వివిధ మీడియా సంస్థల్లో పనిచేసే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల నుండి ధరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతోంది.రాష్ట్ర మరియు జిల్లాస్థాయి అక్రిడిటేషన్లకై అర్హులైన మీడియా ప్రతినిధులు అందరూ ఈపోర్టల్ లో ధరఖాస్తు చేసుకోవచ్చును.ఈపోర్టల్ లో ధరఖాస్తు చేసుకున్న జర్నలిస్ట్ లు తమ అప్లికేషన్ స్టేటస్ ఏ దశలో ఉందో కూడా ఈవైబ్ సైట్ ద్వారా తెల్సుకోవచ్చును.ఈపోర్టల్ లో ఏవిధంగా ధరఖాస్తు చేసుకోవాలనే విధి విధానాలను మంగళవారం ప్రత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుంది.

# ఎమ్మెల్యేల పెత్తనం పెరిగిపోతోంది

## - పవన్ కల్యాణ్



అమరావతి, **నవంబర్10ప్రజావినికిడి:** 'కూటమి ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలని పదే పదే చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. చాలా చోట్ల ఎమ్మెల్యేలు చెబితేనే పనులవుతున్నాయి. దీనిని సరిదిద్దుకోకపోతే మనం చెప్పే గవర్నెన్స్‌కు.. ప్రజాపాలనకు అర్థం మారిపోతుంది' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని, పార్టీలతో సంబంధం లేకుండా.. కూటమి ఎమ్మెల్యేలను గట్టిగా హెచ్చరించాలని కోరారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల పనితీరుపై వాడీవేడి చర్చ జరిగినట్లు సమాచారం. రెవెన్యూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం సూచించినప్పుడు.. భూవివాదాల విషయంలో కొందరు ఎమ్మెల్యేలు వేలు పెడుతున్నారని పవన్ కల్యాణ్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలందరినీ ముఖ్యమంత్రి గట్టిగా హెచ్చరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎర్రచందనం అక్రమ రవాణా, ఆక్రమణలు కూడా చాలా తీవ్రమైన అంశమని, ఆయన ఆక్రమణలను స్వయంగా వీడియో తీశానని, త్వరలోనే విడుదల చేస్తానని తెలిపారు. సీఎం మాట్లాడుతూ.. కూటమి ఎమ్మెల్యేలు ఎవరైనా తప్పు చేస్తుంటే ఇన్‌చార్జి మంత్రులు బాధ్యత తీసుకుని చక్కదిద్దాలని సూచించారు.
రెవెన్యూ సమస్యల పరిష్కారమే ఎజెండాగా వారు పనిచేయాలని కోరారు. అనంతపురంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో భిన్నంగా ముందుకెళ్లామని ఆర్థిక మంత్రి పయ్యావుల క్యాబినెట్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్, ఆర్డీవోలు, ఇతర రెవెన్యూ అధికారులందరినీ కూర్చోబెట్టి 22ఏ లాంటి సుమారు 400 సమస్యలను పరిష్కరించామని ఆయన చెప్పగా.. ఇలాంటివాటిని ఆదర్శంగా తీసుకుని మంత్రులందరూ పనిచేయాలని సీఎం సూచించారు. ఎర్రచందనం విషయంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పవన్ కల్యాణ్ బాగా చేస్తున్నారని అభినందించారు.
పేదలందరికీ ఇళ్లు కల్పించే విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని సీఎం కోరారు. నివాస స్థలం లేని వారందరి జాబితా రూపొందించి అందరికీ ఇళ్ల స్థలాలు దక్కేలా చూడాలన్నారు. ఏడాదిలోగా నివాస స్థలం లేని వారికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వ చర్యలు ఉండాలన్నారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు కూడా బాధ్యత తీసుకునేలా ఇన్‌చార్జి మంత్రులు చొరవ చూపాలని సూచించారు.
విశాఖ భాగస్వామ్య సదస్సు ద్వారా యువతకు మనం ఏం చేస్తున్నామో తెలియాలని చంద్రబాబు అన్నారు. 'రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ఎంత కష్టపడుతున్నాం.. ఎన్ని ఉద్యోగాలు వస్తాయనేది హైస్కూల్ స్థాయి పిల్లలకూ తెలియాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. యువత భవిష్యత్‌కు మనమేం చేస్తున్నామో వారికి తెలియాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు.
జనసేన కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాలివ్వాలని మంత్రి కందుల దుర్గేశ్ కోరగా.. అది పాలసీ మేటర్ అని ఆ పార్టీకే చెందిన మరో మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీఎం స్పందిస్తూ.. పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవలసిందేనన్నారు. సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్నా.. అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు కట్టేందుకు తనకు 45 ఏళ్లు పట్టిందని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ వాళ్లను అభినందించాలన్నారు. అన్ని జిల్లాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.
మొంథా తుఫాన్ సమయంలో బాగా పనిచేశారని మంత్రులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉండి.. బాధితులకు తక్షణ సాయం అందేలా చూశారని.. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే సహాయ చర్యలు వేగంగా అందాయని తెలిపారు. ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూ.. టెక్నాలజీ సాయంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. మంత్రులు, అధికారులు టీమ్ స్పిరిట్‌తో పనిచేస్తే ఇటువంటి మంచి ఫలితాలే వస్తాయని చెప్పారు. జిల్లాస్థాయిలో సమీక్ష సమావేశాలు కచ్చితంగా నిర్వహించాలని ఇన్‌చార్జి మంత్రులకు స్పష్టంచేశారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్ నిర్వహించాలని.. ప్రతి మంత్రీ నెలకోసారి పార్టీ కార్యాలయానికి రావాలని సీఎం సూచించారు.

# బాల కార్మికులకు 10 మంది విద్యార్థులకు విముక్తి





**గూడూర్ నవంబర్10ప్రజావినికిడి:**
కోనేరు సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి ఆధ్వర్యంలో బాల కార్మికులపై రిస్కు చేయడం జరిగింది రాజశేఖర్ కానిస్టేబుల్, సి ఆర్ పి భాష, శ్రీనివాసులు,మౌనిక ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మునిస్వామి ఏరియా కోఆర్డినేటర్ చిన్న రామాంజనేయులు సోషల్ మొబిలైజర్ గూడూర్ పాత బస్టాండ్ నందు చైల్డ్ లేబర్ డ్రైవ్ కండక్ట్ చేయడం జరిగింది పులకుర్తి పి కోటకొండ పోలకల్ వివిధ ప్రాంతాల నుండి పత్తి చేను పనులకు బాలలను తరలిస్తుండగా కానిస్టేబుల్ సోమ గోపాల్ గారు పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇకపై నుంచి ఎవరైనా బాల బాలికలను తీసుకెళ్లినట్లు మా దృష్టికి వచ్చిందా మీపై కఠిన చర్యలు తీసుకుంటాము పిల్లలు బడికి పెద్దలు పనికి అని మన చట్టంలో ఉంది కాబట్టి మన చట్టాన్ని గౌరవించి పిల్లలందరిని స్కూల్ కి పంపించండి అలా పంపించినచో తల్లిదండ్రులకు తల్లికి వందనం అనే పథకంలో తల్లి ఖాతలోకి 15,000 వేయడం జరుగుతుంది కాబట్టి మీరు అందరూ దీనిని దృష్టిలో పెట్టుకొని పిల్లలను స్కూల్ కి పంపించండి నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీ అందరి చేతుల్లో ఉన్నది రేపటి భవిష్యత్తు కోసం పెద్దలందరూ కష్టపడి పనులు చేసుకుంటూ పిల్లలకు మంచి చదువులు చదివించి వారి భవిష్యత్తు బంగారు బాటగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీ అందరి చేతిలో ఉన్నది అని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాజశేఖర్ కానిస్టేబుల్, శ్రీనివాసులు, భాష సి ఆర్ పి మౌనిక ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మునిస్వామి ఏరియా కోఆర్డినేటర్ చిన్న రామాంజనేయులు సోషల్ మొగలైజర్ తదితరులు పాల్గొన్నారు

# బీహార్‌లో రాహుల్ ఓట్ చోరీ పనిచేసేనా?

**నవంబర్10ప్రజావినికిడి:**
బీహార్ ఎన్నికలు ఓ రకంగా బిజెపికన్నా రాహుల్‌కే ప్రతిష్టాత్మకంగా భావించాలి. ఓట్ చోరీ పేరుతో మన ఎన్నికల వ్యవస్థను అప్రతిష్టపాలు చేసిన వ్యక్తిగా రాహుల్ చరిత్రలో నిలిచపోయారు. ఆయన మోడీ పాలన పై చేస్తున్న విమర్శలను సహేతుకంగా తీసుకోవచ్చు. కానీ ఓట్ చోరీ పేరుతో వ్యవస్థను బద్నాం చేస్తూ వచ్చారు. ఆయన అమెరికా వెళ్లి వచ్చినప్పుడల్లా ఏదో అంశం మీద రచ్చచేస్తూనే ఉన్నారు. పంజాబ్‌లో రైతులను రెచ్చగొడుతూనే వచ్చారు. అధికార లేమితో కాంగ్రెస్ నానాయాగీ చేస్తోందని చెప్పుకోవచ్చు. అలాగే తమ యూపిఎ పాలనలో అక్రమాలపై నోరు మెదపడం లేదు. బీహార్‌లో కాంగ్రెస్ ఎన్నటికీ విజయం సాధించే అవకాశం లేదు. బీహార్‌లో తొలిద ముగిసింది. రెండోదశ మంగళవారం ఎన్నికలు జరుగబోతు న్నాయి. ఈ క్రమంలో తమదే అధికారం అని చెబుతున్న రాహుల్, ఓడిపోతే ఓట్‌చోరీతో మరింత యాగీ చేయాలన్న బలమైన వ్యూహంతో ఉన్నారు. ఇకపోతే ఇప్పటికే 9సార్లు సిఎంగా గెలిచిన నితీశ్ కుమార్‌కు ఓ రకంగా ఇవి చివరి ఎన్నికలని భావించాలి. గెలిస్తే పదోసారి సిఎంగా ప్రమాణం చేస్తారా లేదా అన్నది చూడాలి. 2020 అసెంబ్లీ ఎన్నికలలో జనతాదళ్ ఓట్ల వాటా 15 శాతంగా ఉన్నది. నితీశ్ మళ్లీ అధికారానికి రావడానికి ఇది విశేషంగా తోడ్పడింది. 2005 నుంచి ప్రతి ఎన్నికల్లోను రెండు వర్గాలు నితీశ్‌కు పూర్తి మద్దతునిస్తున్నాయి. మహిళలు, బాగా వెనుకబడిన కులాలవారు నితీశ్‌కు మద్దతునిస్తున్నారు. మహిళా ఓటర్ల శక్తిని జాతీయ రాజకీయ పక్షాలు కనుగొనక ముందే నితీశ్‌కుమార్ మహిళా ఓటర్ల ఆదరాభిమానాలను బాగా చూరగొన్నారు. మృదుభాషిగా పేరున్న నితీశ్ తన ప్రత్యర్థిగా మారిన స్నేహితుడు, పల్లెటూరి మనిషిలా వ్యవహరించే లాలూప్రసాద్‌కు పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఈ కారణంగానే మహిళా ఓటర్లను నితీశ్ ఆకట్టుకున్నారు. అచంచలమైన కుల సంబంధిత విధేయతలతో పాటు మహిళా ఓటర్ల మద్దతు నితీశ్ విజయాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. 2005లో నితీశ్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చదువుకుంటున్న బాలికలు అందరికీ ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఆనాడు లబ్ది పొందిన బాలికలు ఇప్పుడు వయోజన ఓటర్లుగా ఉన్నారు. ఆ మహిళా ఓటర్లే నితీశ్ నాయకత్వానికి, అధికార ప్రాభవానికి వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పకతప్పదు. ఈ కారణంగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నితీశ్‌ను ఎన్‌డిఎ పక్షాన ఉంచుకునేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. తనను వ్యతిరేకించిన వారిని క్షమించే అలవాటు లేని మోదీ, ఒకప్పుడు నితీశ్ తనను తీవ్రంగా వ్యతిరేకించారన్న వాస్తవాన్ని పూర్తిగా విస్మరించడం వెనక బీహార్ ప్రయోజనాలే ముఖ్యమని గుర్తించారని చెప్పకతప్పదు. బిహార్‌లో బీజేపీ ఎదుగుదలకు నితీశ్‌తో పొత్తు తప్పనిసరని ప్రధానమంత్రి గ్రహించారు. మరోమారు బీహార్‌లో ఎన్‌డిఎ విజయం సాధిస్తే.. సమీప భవిష్యత్తులో బిహార్‌లో కూడా ఏక్‌నాథ్ షిండే లాంటి తిరుగుబాటు సంభవించే అవకాశం లేకపోలేదు. అయినా ప్రస్తుతానికి మాత్రం బీజేపీ ఎన్నికల విజయాలకు నితీశ్‌కుమార్ ఆవశ్యకత అమితంగా ఉన్నది. లాలూప్రసాద్ యాదవ్‌తో ఉన్న రాజకీయ అనుబంధాన్ని తెగతెంపులు చేసుకుని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనత పార్టీతో నితీశ్ జతకట్టంలో ఆయన స్వార్థం కూడా ఉంది. నిరంతరాయంగా బీహార్ సిఎంగా నిలిచిపోవాలన్న ఆయన కాంక్షను కాదనలేం. రాజకీయ సౌలభ్యం



కోసమే ఆయన మళ్లీ మోదీతో చేయి కలిపారు. అలాగని బీజేపీకి నితీశ్ కుమార్ పట్ల ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. 2013లో ప్రధానమంత్రి పదవికి అవసరమైన అర్హతలు నరేంద్ర మోదీకి లేనేలేవని తొట్టతొలుత నిరసన తెలిపిన నేత నితీశ్‌కుమార్. ఈ విషయాన్ని బీజేపీ మరచిపోయి ఉండదు. అయితే బిహార్‌లో ఎన్డీఏకు సమర్థంగా నేతృత్వం వహించగల నాయకుడు మరొకరు లేరన్న వాస్తవమూ బీజేపీకి బాగా తెలుసు. నితీశ్‌కు ప్రత్యామ్నాయంగా మరెవ్వరూ లేనందునే బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగనిస్తోంది. వయసు మీదపడడంతో నితీశ్ కుమార్ కూడా తప్పని పరిస్థితుల్లో మోదీయే సర్వం అయిన ఢిల్లీ దర్బార్‌కు విధేయుడుగా ఉంటూ వస్తున్నారు. అయితే మారుతున్న కలానుగుణంగా బిహార్ ఓటర్లలో అత్యధికులు సైతం మౌలిక మార్పులు కోరుకుంటున్నారు. మరి ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ పార్టీకి వారు ఓటు వేస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది. తేజస్వి యాదవ్ కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ఇకపోతే బీహార్ ఓటర్ల సవర్ణ రచ్చ కూడా చర్చకు దారితీస్తోంది. ఎంఐఎం కూడా ముస్లిం డామినేట్ ఉన్న ప్రాంతాల్లో బరిలోకి దిగింది. ఈ క్రమంలో బీహార్ ఎన్నికలు ఎవరికి మొగ్గు చూపుతాయి, ప్రజలు ఆలోచన ఏ విధంగా ఉందన్నది కూడా అంతుచిక్కడం లేదు. ఇప్పటికే బిహార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంలో నితీశ్ రికార్డు సృష్టించారు. ఇప్పటికి మొత్తం తొమ్మిది సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ బిహార్‌కు ఆయన నాయకత్వం తప్పనిసరి అని పలువురు, ముఖ్యంగా బీజేపీ భావిస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం కొత్త తరం బిహారీ రాజకీయ నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ప్రోత్సహించడం ద్వారా నితీశ్ స్థాయిని తగ్గించేం దుకు బీజేపీ ప్రయత్నించింది. నితీశ్ ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా జనతాదళ్ (యునైటెడ్) పార్టీ ఓటర్లను తనవైపు తిప్పుకోవాలన్నది బీజేపీ ఎత్తుగడ. గత శాసనసభ ఎన్నికల్లో జనతాదళ్(యు) కేవలం 43 సీట్లు మాత్రమే కైవసం చేసుకోగా బీజేపీ 74 నియోజక వర్గాలలో జయపతాక నెగురవేసింది. అయినప్పటికీ నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకు బీజేపీ సంకోచించింది. తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేసేందుకు సుముఖత చూపలేదు. నితీశ్ కుమార్ అపరచాణక్యుడు. బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకు న్నారు. ఆ పార్టీతో పొత్తును కొనసాగించడం ప్రమాదకరమని భావించారు. మహారాష్ట్రలో శివసేనను నిలువు నా చీల్చివేసిన రీతిలో బిహార్‌లో తన పార్టీని బీజేపీ చీల్చకుండా ఉంటుందా అని నితీశ్ ఆలోచించారు. అందుకే బిజెపిని తన దగ్గరే పెట్టుకుని జాగ్రత్తగా ఉంటున్నారు. అయితే ఈసారి ఆయన పదోసారి సిఎంగా బాధ్యతలు స్వీకరిస్తారా లేదా అన్నది చూడాలి. ఈక్రమంలో తేజస్వీ యాదవ్ సిఎం కావడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు కాంగ్రెస్ ఘట్‌బంధన్ కలసివస్తుందా లేదా అన్నది చూడాలి. అలాగే రాహుల్ ఓట్‌చోరీ ఆరోపణలు ఏమేరకు ఫలితం ఇస్తుందో చూడాలి.

# ఢిల్లీ సమీపంలో భారీగా ఆయుధాల స్వాధీనం

### 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాల స్వాధీనం

### హర్యానాతో కలసి కాశ్మీర్ పోలీసుల ఆపరేషన్

### పలువురు ఉగ్రవాదుల అరెస్ట్..వారిలో నలుగురు డాక్టర్లు

న్యూఢిల్లీ, **నవంబర్10ప్రజావినికిడి:**
దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో ఉగ్రవాదులకు సంబంధించిన ఆయుధాలు భారీఎత్తున లభ్యమయ్యాయి. హరియాణాలోని ఫరిదాబాద్‌లో 350 కిలోల అమ్మోనియం నైట్రేట్ సంబంధిత పేలుడు పదార్థాలు, ఒక రైఫిల్ సహా 20 టైమర్లను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక పోలీస్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. ఉగ్రనిరోధక చర్యల్లో జమ్మూకశ్మీర్ పోలీసులు భారీ విజయం సాధించారు. హరియాణా పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు చేశారు. నిషేధిత జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇందులో ముగ్గురు వైద్యులూ ఉన్నారు. ఈ క్రమంలోనే పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం..అక్టోబరు 19న శ్రీనగర్‌లోని బన్‌పొరా నౌగామ్ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకుని.. జైషే మహమ్మద్ పోస్టర్లు వెలిశాయి. ఈ వ్యవహారంపై ఉపా చట్టంతోపాటు ఆయా చట్టాల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా.. ఉగ్రవాద భావజాలం కలిగిన విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌తో కూడిన ఓ ఉగ్రవ్యవస్థ వెలుగుచూసింది. ఈ బృందానికి పాకిస్థాన్, ఇతర దేశాల నుంచి పనిచేస్తున్న హ్యాండ్లర్లతో సంబంధాలున్నాయి. సామాజిక, ధార్మిక కార్యక్రమాల ముసుగులో అవసరమైన



నిధులు సేకరించారు. వ్యక్తుల్లో తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించి ఉగ్రసంస్థల్లో చేర్పించడం, లాజిస్టిక్స్ ఏర్పాటు, ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు ఐఈడీల తయారీకి అవసరమైన పదార్థాల సేకరణలో పాల్గొన్నట్లు గుర్తించాం. ఈ కార్యకలాపాల సమన్వయం కోసం నిందితులు ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్లను ఉపయోగించారని పోలీసు ప్రతినిధి వెల్లడించారు. ఉగ్ర పోస్టర్లు అంటించిన డాక్టర్‌ను విచారిస్తే భారీ ఆయుధ డంప్ వెలుగులోకి.. వచ్చింది. అరెస్టైన వైద్యుల్లో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంకు చెందిన డా.ఆదిల్, పుల్వామాకు చెందిన డా.ముజమ్మిల్ అహ్మద్, లఖ్‌నవూకు చెందిన డా.షాహీన్ ఉన్నారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో డా.ముజమ్మిల్ అహ్మద్ అద్దె నివాసంలో పోలీసులు భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇతడు అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో బోధకుడిగా పనిచేస్తున్నాడు. శ్రీనగర్‌లో జైషే మమహ్మద్ పోస్టర్లు వేసిన కేసులోనూ వాంటెడ్‌గా ఉన్నాడు. ఇతడిని అరెస్టు చేసినట్లు అంతకుముందు ఫరీదాబాద్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. మరోవైపు.. షాహీన్ కారులో ఓ ఏకే-47 రైఫిల్ లభ్యమైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్ లోని ఆయా ప్రాంతాలతోపాటు హరియాణాలోని ఫరీదాబాద్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పుర్‌లో స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించాం. ఈ క్రమంలోనే మరికొంతమంది నిందితుల పాత్ర బయటపడింది. వారినీ అరెస్టు చేస్తాం. ఇప్పటివరకు ఓ చైనీస్ స్టార్, బెరెట్టా పిస్టల్స్, ఏకే 56, ఏకే క్రింకోవ్ రైఫిళ్లు, 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలు స్వాధీనం చేసుకున్నాం. నిధులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి తెలిపారు. వీటితో పాటు మూడు మ్యాగజైన్లు, పిస్టల్, వాకీటాకీ సెట్‌ను స్వాధీనపరచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీనగర్‌లో అక్టోబర్ 27న
జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పలు పోస్టర్లు వెలిశాయి. వీటిని కశ్మీర్‌కు చెందిన వైద్యుడు ఆదిల్ అహ్మద్ రాథర్ వేసినట్లు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు పసిగట్టారు. సదరు వ్యక్తి ఉత్తర్ ప్రదేశ్ సహరాన్‌పుర్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యుడిగా సేవలందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతణ్ని గతవారం అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. నిందితుడు గతేడాది అక్టోబర్ ముందువరకూ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విధులు నిర్వర్తించాడని, అక్కడ అతని లాకర్‌ను తనిఖీ చేయగా ఒక రైఫిల్ దొరికిందని తెలిపారు. అతను ఇచ్చిన సమాచారం ప్రకారమే ఫరిదాబాద్‌లో ఈ రికవరీ జరిగినట్లు వెల్లడించారు. నిందితుడు రాథర్ చెప్పిన ప్రకారం.. ముజామ్మిల్ షకీల్ అనే మరో డాక్టర్ వద్ద కూడా పేలుడు పదార్థాలు, ఆయుధ సామాగ్రి నిల్వ ఉన్నట్లు తేలింది. దీంతో పుల్వామాకు చెందిన షీకల్‌నూ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడు ఫరిదాబాద్‌లోని ఆల్-ఫలాహ్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ఓ మహిళా వైద్యురాలి కారులో ఒక రైఫిల్, పిస్టల్ బయటపడ్డాయి. ఆమె మందుగుండు సామాగ్రిని నిల్వచేసేందుకు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్న దర్యాప్తు అధికారులు.. ఆమెపై విచారణ చేపట్టారు.

# జడ్జీలపై ఆరోపణల ట్రెండ్..

## సహించబోం: సీజేఐ గవాయ్ అసహనం

న్యూఢిల్లీ,**నవంబర్10ప్రజావినికిడి:**
తమకు అనుకూలంగా తీర్పులు రానప్పుడు న్యాయమూర్తులపై తీవ్రమైన, నిరాధార ఆరోపణలు చేసే ధోరణి పెరిగిపోవడంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఎన్. పెద్ది రాజు



అనే వ్యక్తిపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా సీజేఐ సోమవారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్యపై పెద్ది రాజు తీవ్రమైన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. అయితే, పిటిషనర్ పెద్ది రాజు చెప్పిన క్షమాపణను సదరు న్యాయమూర్తి అంగీకరించారని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోర్టుకు తెలిపారు. దీంతో ధర్మాసనం ఈ కేసును మూసివేసింది. అయినప్పటికీ, ఈ ధోరణిపై సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు."న్యాయస్థానానికి సేవకులుగా ఉండే న్యాయవాదులకు కోర్టు పట్ల ఒక బాధ్యత ఉంటుంది. శిక్షించడంలో కాదు, క్షమాపణ చెప్పినప్పుడు క్షమించడంలోనే చట్టం యొక్క గొప్పతనం ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న హైకోర్టు న్యాయమూర్తే క్షమాపణను అంగీకరించారు కాబట్టి మేము ఈ కేసును ముందుకు తీసుకెళ్లడం లేదు. అయితే, న్యాయమూర్తులపై ఆరోపణలు చేసే పిటిషన్లపై సంతకాలు చేసే ముందు న్యాయవాదులు చాలా జాగ్రత్తగా ఉండాలి" అని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఎస్సీ/ఎస్టీ చట్టం కేసులో హైకోర్టు ఉపశమనం కల్పించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ పెద్ది రాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన బదిలీ పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పక్షపాతంతో వ్యవహరించారని, అనుచితంగా ప్రవర్తించారని తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై జులైలో తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు, పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు నిరాకరించి.. రాజు, అతని న్యాయవాదులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.
ఈ నెల 23న పదవీ విరమణ చేయనున్న సీజేఐ గవాయ్, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి చర్యల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

# ఏపీలోని ప్రభుత్వ ఆసుపత్రులకు కొత్త వైద్యులు..

## 227 మంది స్పెషలిస్టులకు పోస్టింగ్‌లు

**అమరావతి, నవంబర్10ప్రజావినికిడి:**
రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో స్పెషలిస్ట్ వైద్యుల కొరతను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పీజీ విద్యను పూర్తి చేసుకున్న 227 మంది వైద్యులకు రాష్ట్రవ్యాప్తంగా 142 సెకండరీ ఆసుపత్రులలో పోస్టింగ్‌లు ఇచ్చినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.ఇన్‌సర్వీస్ కోటాలో 12 వేర్వేరు



విభాగాల్లో పీజీ పూర్తి చేసిన ఈ వైద్యులను కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా కేటాయించినట్లు మంత్రి వివరించారు. వీరిలో 33 ఏరియా ఆసుపత్రులలో 60 మంది, ఏడు జిల్లా ఆసుపత్రులలో 10 మంది, రెండు ఎంసీహెచ్ ఆసుపత్రులలో ఇద్దరు స్పెషలిస్టులకు పోస్టింగ్‌లు ఇచ్చారు. అత్యధికంగా గూడూరు ఏరియా ఆసుపత్రికి నలుగురు స్పెషలిస్టులను కేటాయించారు. వీరిలో చిన్నపిల్లల వైద్యుడు, రేడియాలజిస్ట్, చర్మవ్యాధి నిపుణుడు, పాథాలజిస్ట్ ఉన్నారు.నియమితులైన 227 మందిలో గైనకాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో 35 మంది చొప్పున, జనరల్ సర్జరీలో 30 మంది, మత్తు వైద్యులు 26 మంది, చిన్నపిల్లల వైద్య నిపుణులు 25 మంది, ఎముకల వైద్యులు 18 మంది, రేడియాలజిస్టులు 17 మంది, కంటి, ఈఎన్‌టీ వైద్య నిపుణులు కూడా ఉన్నారు. 2022-23లో ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ కోర్సుల్లో చేరిన 257 మంది పీహెచ్‌సీ వైద్యులు ఇటీవల తమ కోర్సులు పూర్తి చేశారు. వారిలో 227 మందిని సెకండరీ ఆసుపత్రులలో నియమించగా, ఖాళీలు లేకపోవడంతో మిగిలిన 30 మందికి డీఎంఈ పరిధిలోని ఆసుపత్రులలో ట్యూటర్లుగా అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు.ఈ నియామకాలతో పాటు త్వరలోనే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు 155 మంది, 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరో 155 మంది స్పెషలిస్ట్ వైద్యులు విధుల్లో చేరతారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ పోస్టింగ్‌లకు సంబంధించిన పూర్తి వివరాలను సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్‌బాబు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా. పద్మావతి మంత్రికి వివరించారు.

# అందుబాటులోకి కొత్త ఆధార్ యాప్...

న్యూఢిల్లీ, **నవంబర్10ప్రజావినికిడి:ప్ర**
భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఆధార్ వినియోగదారుల కోసం మరో కొత్త మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్‌లోనే ఆధార్ వివరాలను సురక్షితంగా భద్రపరచుకోవడంతో పాటు, అవసరమైన సమాచారాన్ని సులభంగా పంచుకునేందుకు ఈ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు యూఐడీఏఐ తెలిపింది. ఈ కొత్త యాప్‌తో ఇకపై భౌతికంగా ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని, ఇది పూర్తిస్థాయి పేపర్‌లెస్ అనుభవాన్ని అందిస్తుందని పేర్కొంది.ఈ యాప్‌లో పలు ఆకర్షణీయమైన ఫీచర్లను పొందుపరిచారు. ముఖ్యంగా, ఒకే డివైజ్‌లో కుటుంబ సభ్యులందరి ఆధార్ వివరాలను కూడా భద్రపరచుకునే వెసులుబాటు కల్పించారు. వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫేస్ అథెంటికేషన్ ద్వారా లాగిన్ అయ్యే సౌకర్యం కల్పించారు. మన ఆధార్ వివరాలను




ఇతరులతో పంచుకోవాల్సి వచ్చినప్పుడు, కేవలం అవసరమైన సమాచారాన్ని మాత్రమే (సెలెక్టివ్ షేరింగ్) పంపే అవకాశం కూడా ఉంది. బయోమెట్రిక్ వివరాలను లాక్ లేదా అన్‌లాక్ చేసుకునే ఆప్షన్, ఆధార్ కార్డు చివరిసారిగా ఎక్కడ ఉపయోగించారో తెలుసుకునే హిస్టరీని చెక్ చేసుకునే సౌకర్యం కూడా ఇందులో ఉన్నాయి.అయితే, ప్రస్తుతం వాడుకలో ఉన్న 'ఎం-ఆధార్' యాప్‌కు ఇది ప్రత్యామ్నాయం కాదని యూఐడీఏఐ స్పష్టం చేసింది. ఎం-ఆధార్‌లో లభించే డిజిటల్ కార్డు డౌన్‌లోడ్, పీవీసీ కార్డు ఆర్డర్, మొబైల్/ఈ-మెయిల్ వెరిఫికేషన్ వంటి సేవలు ఈ కొత్త యాప్‌లో ఉండవు. కేవలం ఆధార్ డేటాను సురక్షితంగా నిల్వ చేయడం, షేర్ చేయడం కోసమే దీనిని తీసుకొచ్చారు.
ఆండ్రాయిడ్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఫోన్ యూజర్లు యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాక, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఓటీపీ, ఫేస్ అథెంటికేషన్ పూర్తి చేయాలి. అనంతరం, భద్రత కోసం ఒక పిన్ నంబర్‌ను సెట్ చేసుకుని యాప్‌ను ఉపయోగించడం ప్రారంభించవచ్చు. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సేవలు మరింత సులభంగా, సురక్షితంగా మారతాయని అధికారులు భావిస్తున్నారు.

# 14నుండి టెస్ట్ సిరీస్ ప్రారంభం

**● భారత్- దక్షిణాఫ్రికా మధ్య రెండు టెస్టులు**

**● తిరిగి జట్టులోకి రానున్న రిషబ్ పంత్**




దక్షిణాఫ్రికా జట్టు భారతదేశ పర్యటనకు వస్తోంది. ఈ టూర్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనున్నారు. దక్షిణాఫ్రికా, భారత్ సిరీస్ శుక్రవారం, నవంబర్ 14 నుంచి ప్రారంభం కానుంది. ఇరు జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ ఈ 14న ప్రారంభం కానుంది. భారత టెస్ట్ జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో గాయం నుంచి కోలుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి రానున్నాడు. అంతకుముందు పంత్‌ను దక్షిణాఫ్రికా ఏతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఏ జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. పంత్ చేరికతో బ్యాటింగ్ మరింత పటిష్టం కానుంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ సిరీస్ నవంబర్ 14న ప్రారంభమై నవంబర్ 26 వరకు జరుగుతుంది. మొదటి టెస్ట్ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్, రెండో మ్యాచ్ గౌహతిలో జరగనుంది. భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ నవంబర్ 14 నుంచి నవంబర్ 18 వరకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఈ టెస్ట్ మ్యాచ్ ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ టెస్ట్ సిరీస్‌లో రెండో మ్యాచ్ నవంబర్ 22 నుంచి నవంబర్ 26 వరకు గౌహతిలోని బర్సపరా స్టేడియంలో జరుగుతుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు మొదలవుతుంది. భారత జట్టు ఓపెనింగ్ బాధ్యతలు మరోసారి యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ భుజాలపై పడనున్నాయి. ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్స్ ఇటీవల అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. స్వదేశీ పరిస్థితులలో పరుగులు చేసిన అనుభవాన్ని కలిగి ఉన్నారు. ప్రారంభ ఇన్నింగ్స్ తర్వాత, కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, వైస్-కెప్టెన్ రిషబ్ పంత్ మిడిల్ ఆర్డర్‌కు స్థిరత్వంతోపాటు, దృఢత్వాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. కోల్‌కతా స్పిన్-ఫ్రెండ్లీ పిచ్‌లను పరిగణనలోకి తీసుకుంటే, ఈ బ్యాటింగ్ లైనప్ బాగా సమతుల్యంగా పరిగణిస్తున్నారు. వీరు ప్రత్యర్థి బౌలర్లకు సవాలుగా మారవచ్చు.

# రోహిత్, కోహ్లీ స్థానాలను భర్తీ చేయవచ్చు

**● ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా**




విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల వన్డే భవిష్యత్తుపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా తీవ్రంగా స్పందించాడు. ప్రస్తుత క్రికెట్‌లో ఎవరి స్థానాన్ని అయినా భర్తీ చేయగల ఆటగాళ్లు ఉన్నారని అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్ ఆడతారా లేదా అనేది అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి కూడా పెద్ద సవాలుగా మారింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు బాగా బ్యాటింగ్ చేసి, కుర్రాళ్లకు తాము గట్టిపోటీ ఇస్తామని.. వారితో పోటీపడి పరుగులు సాధించగలమని నిరూపించుకున్నారు. ముఖ్యంగా రోహిత్ శర్మ మంచి టచ్‌లో కనిపించాడు. కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌లలో డకౌటైనా.. మూడో వన్డేలో కీలక ఇన్నింగ్స్‌తో కమ్ బ్యాక్ చేశాడు. 2 సంవత్సరాల తర్వాత జరిగే ప్రపంచ కప్‌లో ఆడేందుకు వీరి స్థానంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఒక భారత జర్నలిస్ట్‌తో ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ వా మాట్లాడుతూ, "ఆటగాళ్ళు బాధ్యత తీసుకోవాలి. ఎందుకంటే ఎవరూ ఈ ఆట కంటే పెద్దవారు కాదని అర్థం చేసుకోవాలి. మీరు మిమ్మల్ని ఆట కంటే ఎక్కువ అని భావించకూడదు. ఎవరైనా రోహిత్, కోహ్లీ స్థానాన్ని భర్తీ చేయవచ్చు. ఏ ఆటగాడు కూడా ఆటను తన ఇష్టం వచ్చినట్లు ముందుకు తీసుకెళ్లలేరని నేను నమ్ముతున్నాను. చివరికి, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ జట్టు ప్రయోజనాల కోసం నిర్ణయం తీసుకోవాలని" కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ ఆటగాళ్లను ట్రయల్స్‌లో ఉంచలేమని అజిత్ అగార్కర్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే మీడియా నివేదికల ప్రకారం, 2027 ప్రపంచ కప్ కోసం జట్టును ఎంపిక చేయడం కేవలం ప్రదర్శన ఆధారంగానే ఉంటుందని %దీజజ×% అధికారులు చెబుతున్నారు. రోహిత్ శర్మ ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో 202 పరుగులు చేసి రాణించాడు. తన బ్యాటింగ్ ప్రదర్శనకుగానూ రోహిత్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు కూడా అందుకున్నాడు. మరోవైపు, విరాట్ కోహ్లీ చివరి వన్డే మ్యాచ్‌లో 74 పరుగులు చేసి ఫామ్‌లోకి వచ్చినట్లు సంకేతాలు ఇచ్చాడు. ఈ ప్రదర్శన ఆధారంగా ప్రపంచ కప్‌లో ఆడేందుకు తాను కూడా రేసులో ఉన్నానని చూపించాడు. స్టీవ్ వా మాట్లాడుతూ.. "అజిత్ అగార్కర్‌తో ఆటగాళ్లకు గుడ్ రిలేషన్ ఉంటుందని నేను ఆశిస్తున్నాను. కానీ అదే సమయంలో ఆటగాళ్లతో తగినంత దూరం పాటించాలి. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో సమన్వయం చేసుకోవడం ముఖ్యమే. కానీ విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ ఏమను కుంటున్నారు. దేని ఆధారంగా జట్టు ఎంపిక జరుగుతుందనే విషయంపై ముందే క్లారిటీ ఇవ్వడం మంచిది. అనుభవానికి ప్రాధాన్యత ఇస్తారో, లేక ఆ సమయంలో ఫామ్, పరుగులు చేసే తీరును పరిగణనలోకి తీసుకుంటుందో బీసీసీఐ సెలక్షన్ కమిటీ డిసైడ్ చేసుకోవాలి. ప్రతి ఒక్కరిని రీప్లేస్ చేసే సత్తా ఉన్న యువ ఆటగాళ్లు ఉన్నారని గుర్తుంచుకోవాలని" సూచించాడు.

## సన్ రైజర్స్‌లోకి రోహిత్ శర్మ..?




ఐపీఎల్ 2026 సందడి మరికొన్ని రోజుల్లో మొదలుకాబో తుంది. నవంబర్ 15లోపు అన్ని ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను బీసీసీఐకి సమర్పించాలి. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు.. ఇప్పుడు తమ టాప్ ప్లేయర్లను ఎక్స్ఛేంజ్ చేసుకోబోతున్నట్లు వస్తున్న వార్తలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ ఒప్పందం జరిగితే ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత హై ప్రొఫైల్ ట్రేడ్ అవుతుందంటున్నారు క్రీడా నిపుణులు.ముంబై ఇండియన్స్ ప్లేయర్ రోహిత్ శర్మ హైదరాబాద్కు. బదులుగా స్టార్ బ్యాట్స్‌మన్ ట్రావిస్ హెడ్ ముంబై ఇండియన్స్ కు మారబోతున్నట్లు నెట్టింట్లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటికైతే రెండు ఫ్రాంచైజీలు.. ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన జారీ చేయలేదు. అయితే ఇదంతా 'ఎక్స్'లో ఇండియన్ క్రికెట్ అనే అకౌంట్ నుండి వచ్చిన పోస్ట్‌తో మొదలైంది. రోహిత్ శర్మ ఆధ్వర్యంలో ముంబై ఇండియన్స్ ఐపీఎల్‌లో ఐదుసార్లు టైటిల్స్‌ని గెలుచుకుంది. హిట్‌మ్యాన్ బ్యాటింగ్‌కు వెన్నెముక లాంటివాడు.. తనకున్న అనుభవంతో ఏ జట్టునైనా టాప్‌లో ఉంచుతాడు. రోహిత్ మరియు అభిషేక్ శర్మ కలిసి ఓపెనింగ్ చేస్తే ఐపీఎల్ రికార్డులు బద్దలవుతాయని చాలా మంది క్రికెట్ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ముంబై ఫ్యాన్స్ మాత్రం.. రోహిత్ శర్మ హైదరాబాద్ కి వెళ్తే అది తమకు పెద్ద నష్టమని బాధపడుతున్నారు. అయితే ట్రావిస్ హెడ్ కూడా చాలా దూకుడుగా ఆడగల సమర్థుడు. 2023 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన హెడ్.. హైదరాబాద్ తరపున కూడా గత సీజన్‌లో బలమైన ప్రదర్శన ఇచ్చాడు. ఇక ఈ ఒప్పందం జరిగితే ట్రావిస్ హెడ్ ముంబై తదుపరి కెప్టెన్ కావొచ్చని కొంతమంది అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ట్రేడ్ చేస్తే రోహిత్ శర్మ అనుభవం, అభిషేక్ శర్మ దూకుడు కలిపి బలమైన ఓపెనింగ్ లైనప్‌ను తయారు చేసుకోవచ్చని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటికే ఐపీఎల్ అభిమానులు డిసెంబర్ మినీ వేలం మరియు ట్రేడ్ విండో ప్రకటనల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి ఎక్స్ఛేంజ్ పుకార్లు నిజమవుతాయా లేదా కేవలం ఊహలేనా అనేది త్వరలోనే తెలియనుంది. ఐపీఎల్ 2026కి ముందు ఈ డ్రామా అభిమానుల్ని మరింత ఆకట్టుకుంటోంది.

# హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీ వదిలి బ్యాటింగ్, ఫీల్డింగ్‌పై దృష్టి పెట్టాలి

**● మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామి వివాదాస్పద వ్యాఖ్యలు**




భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో టీమిండియా చరిత్ర సృష్టించింది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి, తొలిసారిగా ఐసీసీ మహిళా వన్డే వరల్డ్ కప్ 2025 టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయాన్ని యావత్ దేశం సెలబ్రేట్ చేసుకుంటున్న తరుణంలో మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామి చేసిన వ్యాఖ్యలు కొత్త వివాదానికి తెర తీశాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ ఇకపై కెప్టెన్సీ వదిలి తన బ్యాటింగ్, ఫీల్డింగ్‌పై దృష్టి పెట్టాలని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐసీసీ మహిళా వన్డే ప్రపంచ కప్ 2025లో భారత్ విజయం సాధించిన తరువాత దేశమంతా ఆనందంలో మునిగి తేలుతోంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా జట్టును అభినందించారు. ఈ ఉత్సవాల మధ్యే, భారత మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామి చేసిన ఒక వ్యాఖ్య సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. హర్మన్‌ప్రీత్ కౌర్ ఇప్పుడు కెప్టెన్సీని వదిలిపెట్టి, తన బ్యాటింగ్‌పై, ఫీల్డింగ్‌పై పూర్తిగా దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈ వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీశాయి. శాంతా రంగస్వామి వ్యాఖ్యలపై మరో మాజీ భారత కెప్టెన్ అంజుమ్ చోప్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌డిటివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన అభిప్రాయాన్ని బలంగా వెల్లడించారు. "ప్రతి ప్రపంచ కప్ తరువాత ఇలాంటి వ్యాఖ్యలు రావడం సాధారణమైపోయింది. గత నాలుగైదు టోర్నమెంట్లు చూడండి, జట్టు ఓడిపోయినప్పుడు హర్మన్‌ను తొలగించాలని అంటారు. జట్టు గెలిచినప్పుడు కూడా హర్మన్‌ను తొలగించాలని అంటున్నారు" అని అంజుమ్ చోప్రా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రస్తుతం టీమిండియా విజయాన్ని సెలబ్రేట్ చేసుకునే సమయం ఇది అని, ఇలాంటి మాటలతో ఆటగాళ్ల కష్టాన్ని విస్మరించకూడదని అంజుమ్ అన్నారు. అందుకే, ఈ సమయంలో తాను దీనిపై ఎటువంటి వ్యాఖ్య చేయదల్చుకోలేదని, ఎందుకంటే అది భారత విజయాన్ని పాడుచేస్తుంది అని ఆమె పేర్కొన్నారు. హర్మన్‌ప్రీత్ కౌర్, అంజుమ్ చోప్రా మధ్య కేవలం సహచర క్రీడాకారిణి/సీనియర్ సంబంధం మాత్రమే కాదు, అంతకు మించి బలమైన అనుబంధం ఉంది. ప్రపంచ కప్ గెలిచిన తర్వాత కూడా హర్మన్‌ప్రీత్ తన కెరీర్ తొలి రోజుల్లో అంజుమ్ ఇచ్చిన మద్దతును బహిరంగంగా గుర్తు చేసుకున్నారు. 2007-08లో ముంబైలో జరిగిన ఛాలెంజర్ ట్రోఫీ టోర్నమెంట్‌లో అండర్-19 ప్లేయర్‌గా ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ ఎంత శక్తివంతంగా బంతిని కొట్టగలదో అప్పుడే తాను చూశానని అంజుమ్ గుర్తు చేసుకున్నారు. "అప్పుడే హర్మన్ ఒక ప్రత్యేకమైన ప్రతిభావంతు రాలని నేను గ్రహించాను" అని ఆమె అన్నారు. "హర్మన్ మ్యాచ్ విన్నర్ కాదని నేను ఒక్క క్షణం కూడా అనుకోలేదు. అందుకే నేను ఎప్పుడూ చెబుతూనే ఉంటాను, హర్మన్ మా కెప్టెన్ అయి ఉండాలి" అని అంజుమ్ చోప్రా గట్టిగా మద్దతు పలికారు.


# రిటైన్, రిలీజ్ లిస్ట్‌లపై ఫోకస్ పెట్టిన సన్‌రైజర్స్




ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తీవ్రంగా నిరాశపర్చింది. వై నాట్ 300 అంటూ భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరకుండానే ఇంటి దారిపట్టింది. తమకే సాధ్యమైన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సీజన్‌ను ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. అనూహ్యంగా వరుస పరాజయాలతో చతికిలపడింది. చివర్లో పుంజుకొని హ్యాట్రిక్ విజయం సాధించినా టోర్నీలో ముందుడుగు వేయలేకపోయింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో 6 గెలవడంతో పాటు ఓ మ్యాచ్ రద్దవ్వడంతో 13 పాయింట్స్ సొంతం చేసుకొని 6వ స్థానంతో సరిపెట్టుకుంది. మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, ప్యాట్ కమిన్స్, జీషన్ అన్సారీలు తీవ్రంగా నిరాశపర్చారు. ముఖ్యంగా మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, జీషన్ అన్సారీల వైఫల్యం సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. డిసెంబర్ చివరి వారంలో ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన మినీ వేలం జరగనుంది. నవంబర్ 15లోపు రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాలను ఫ్రాంచైజీలు ప్రకటించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఫ్రాంచైజీలు తమ రిటైన్, రిలీజ్ లిస్ట్‌లపై ఫోకస్ పెట్టాయి. జట్టుకు భారంగా మారిన ఆటగాళ్లను వదులుకునేందుకు సిద్ధమయ్యాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా తమకు భారంగా మారిన ఆటగాళ్లను వదిలేసే ఆటగాళ్లను వదిలేయనుంది. ముఖ్యంగా టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీతో పాటు అభినవ్ మనోహర్, జీషన్ అన్సారీ, రాహుల్ చాహర్, ఆడమ్ జంపాలను సన్‌రైజర్స్ వదులుకునే ఛాన్స్ ఉంది. ఈ ఐదుగురు ఆటగాళ్లు జట్టుకు భారంగా మారారు. రూ. 10 కోట్లు పెట్టిన కొన్న మహమ్మద్ షమీ కనీసం 10 వికెట్లు కూడా తీయలేదు. 9 మ్యాచ్‌లు ఆడి 11.23 ఎకానమీతో 6 వికెట్లు మాత్రమే తీసాడు. రూ. 3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన రాహుల్ చాహర్, రూ. 2.40 కోట్లకు తీసుకున్న ఆడమ్ జంపాలు కూడా జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. ఆడమ్ జంపా ఆరంభంలోనే గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. రెండు మ్యాచ్‌లు ఆడి రెండే వికెట్లు తీసాడు. పేలవ ఫామ్‌తో రాహుల్ చాహర్‌కు తుది జట్టులో ఎక్కువ అవకాశాలు రాలేదు. ఒకే ఒక్క మ్యాచ్ ఆడి ఒకే ఓవర్ బౌలింగ్ చేశాడు. జీషన్ అన్సారీ తన తొలి మ్యాచ్‌లోనే మూడు వికెట్లు తీసి సంచలన ప్రదర్శన కనబర్చినా.. ఆ తర్వాత ఆ జోరు కొనసాగించలేకపోయాడు. రూ.3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన అభినవ్ మనోహర్ కూడా తీవ్రంగా నిరాశర్చాడు. 8 మ్యాచ్‌ల్లో 12.20 స్ట్రైక్‌రేట్‌తో 61 పరుగులు చేశాడుసన్‌రైజర్స్ హైదరాబాద్ వదిలేసే ఆటగాళ్ల జాబితా:మహమ్మద్ షమీ(రూ.10 కోట్లు), రాహుల్ చాహర్(రూ.3.20 కోట్లు), ఆడమ్ జంపా(రూ.2.4 కోట్లు), జీషన్ అన్సారీ(రూ.40 లక్షలు), అభినవ్ మనోహర్(రూ.3.20 కోట్లు)సన్‌రైజర్స్ రిటైన్ చేసుకునే జాబితా ఇదే:హెన్రీచ్ క్లాసెన్(రూ. 23 కోట్లు), ప్యాట్ కమిన్స్(రూ. 18 కోట్లు), ట్రావిస్ హెడ్(రూ. 14 కోట్లు), అభిషేక్ శర్మ(రూ.14 కోట్లు), నితీష్ కుమార్ రెడ్డి(రూ.6 కోట్లు), హర్షల్ పటేల్ (రూ. 8 కోట్లు), ఇషాన్ కిషన్ (రూ. 11.25 కోట్లు), సిమర్‌జీత్ సింగ్ (రూ. 1.50 కోట్లు), అథర్వ టైడ్ (రూ.30 లక్షలు), జయదేవ్ ఉనాద్కత్(రూ.1 కోటి), కమిందు మెండీస్(రూ.75 లక్షలు), అనికేత్ వర్మ(రూ.30 లక్షలు), బ్రైడన్ కార్స్(రూ. కోటి), అనికేత్ వర్మ(రూ. 30 లక్షలు), ఇషాన్ మలింగా(రూ. 1.20 కోట్లు), సచిన్ బేబీ (రూ. 30 లక్షలు)

# కోహ్లీలాగా రోహిత్ శర్మ 600 రన్స్ చేయలేదు

**● టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్**




ఐపీఎల్ ప్రారంభానికి ఇంకా నాలుగైదు నెలల సమయం ఉన్నా ఇప్పట్నుంచే చర్చ మొదలైంది. ప్లేయర్ల ట్రేడింగ్, రిటెన్షన్, మినీ వేలం అంటూ సోషల్ మీడియాలో చర్చంతా ఐపీఎల్ గురించే నడుస్తోంది. ఏయే ప్లేయర్లు ట్రేడ్ అవుతారు ఏయే జట్లలో ఎలాంటి మార్పులు ఉంటాయో అనేది పక్కనపెడిదే, తాజాగా టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మపై కీలక కామెంట్స్ చేశాడు. 600- 700 పరుగులు కొట్టలేదు!18ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో రోహిత్ శర్మ ఏ సీజన్‌లోనూ 600ం పరుగులు చేయలేదని కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో అన్నాడు. ఐపీఎల్‌లో అతడి కెప్టెన్సీకి, అనుభవానికి మార్కులు ఇవ్వొచ్చు. కానీ, విరాట్ కోహ్లీలాగా బ్యాటర్‌గా మాత్రం పెద్దగా ఇంపాక్ట్ చూపించలేదని అన్నాడు. అయితే ప్రస్తుతం రోహిత్ ఫుల్ ఫిట్‌గా ఉన్నాడని, అందుకే రానున్న సీజన్‌లో మాత్రం రోహిత్ సత్తా చాటడానికే ప్రయత్నిస్తాడని తెలిపాడు.'ఐపీఎల్‌లో రోహిత్ శర్మ ఎప్పుడు కూడా 700- 800 పరుగులు బాదలేదు. అయితే ఐపీఎల్‌లో తన అనుభవానికి, కెప్టెన్సీకి మాత్రం ఫుల్ మార్కులు ఇవ్వొచ్చు. కానీ, విరాట్ లేదా ఇతర బ్యాటర్లతో పోలిస్తే మాత్రం అతడు 600ం రన్స్ చేయలేదు. ఒక సీజన్‌లో కేవలం ఒకట్రెండు మ్యాచ్‌ల్లో రాణించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకుంటాడు. రానున్న ఐపీఎల్ సీజన్ రోహిత్‌కు ఓ పరీక్ష వంటిది. అయితే ఈసారి సత్తా చాటే ఛాన్స్ ఉంది. ఇప్పుడు రోహిత్ పరుగులు సాధించాలన్న ఆకలితో ఉన్నాడు. అందుకు తగ్గట్లే బరువు తగ్గి ఫిట్‌గా కనిపిస్తున్నాడు. ఈసారి పక్కా 600ం రన్స్ చేయాలని భావిస్తుంటాడు' అని కైఫ్ పేర్కొన్నాడు.కాగా, 2008 నుంచి రోహిత్ ప్రతీ ఐపీఎల్ సీజన్‌లో పాల్గొన్నాడు. ఇప్పటిదాకా 267 ఇన్నింగ్స్‌ల్లో 7046 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, 47 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. రోహిత్ 2013లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. ఆ సీజన్‌లో 19 మ్యాచ్‌ల్లో 538 రన్స్ చేశాడు. అతడి ఐపీఎల్ కెరీర్‌లో ఎక్కువ పరుగులు నమోదు చేసింది ఆ సీజన్‌లోనే. ఆ తర్వాత ఎప్పుడు కూడా 500 మార్క్ అందుకోలేదు.అలాగే ముంబయి ఇండియన్స్ జట్టుకు పేసర్ జస్ప్రీత్ బుమ్రానే కీలకం అని అన్నాడు. అతడు లేకపోతే జట్టు ఇబ్బంది పడుతుందని, బుమ్రా లేని లోటు 2025 ఐపీఎల్‌లో స్పష్టంగా కనిపించిందని తెలిపాడు. 'బుమ్రా ఎన్ని మ్యాచ్‌లు ఆడగలడు అనేది ముంబయికి అతిపెద్ద సమస్య. అతడు అన్ని మ్యాచ్‌లు ఆడితే అది వేరు. 2025 చూసినట్లైతే, సీజన్ ఆరంభంలో బుమ్రా లేదు. అప్పుడు జట్టు వరుస ఓటములు ఎదుర్కొంది. అతడు వచ్చిన తర్వాత మాత్రం వరుసగా ఆరేడు మ్యాచ్‌ల్లో నెగ్గింది. తేడా స్పష్టంగా కనిపిస్తుంది. అతడు ముంబయికి అత్యంత కీలకమైన ఆటగాడు' అని కైఫ్ వ్యాఖ్యానించాడు.కాగా, ఈ డిసెంబర్‌లో దిల్లీ వేదికగా మినీ వేలం జరిగే అవకాశం ఉంది.

# మీ ఆతిథ్యం అదుర్స్..

## ప్రభాస్‌కు ఇమాన్వీ కితాబు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆతిథ్యం ఎలా ఉంటుందో అభిమానులు, మూవీ లవర్స్‌కు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలు ప్రభాస్ ఇంటి భోజనం ఎంత ప్రత్యేకమో పలు సందర్భాల్లో షేర్ చేసుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని స్వీకరించిన వారిలో తాజాగా అతడి కోస్టార్ ఇమాన్వీ కూడా చేరిపోయింది. ప్రభాస్, ఇమాన్వీ కాంబినేషన్‌లో ఫౌజీ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే.
ఫౌజీ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. షూటింగ్ బ్రేక్ టైంలో ఇమాన్వీ ప్రభాస్ ఇంట్లో పసందైన భోజనాన్ని రుచి చూసింది. సర్‌ప్రైజింగ్‌గా, సంతోషంగా అనిపించింది.. మీ ఆతిథ్యానికి నా మనస్సు, పొట్ట నిండుగా మారిపోయాయి. ప్రభాస్ గారు మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు.. అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది ఇమాన్వీ. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్న ఫౌజీ చిత్రంలో శాండల్ వుడ్ భామ, సింగర్ చైత్ర జే అచర్ కీలక పాత్రలో నటిస్తోంది. పీరియాడిక్ యాక్షన్ రొమాంటిక్ డ్రామా వస్తోన్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. మేకర్స్ ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో విడుదల చేసేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ చేస్తున్నాడు. దీంతోపాటు సలార్ 2, కల్కి 2, స్పిరిట్ చిత్రాలు ట్రాక్‌పై ఉన్నాయి.






# రవితేజ కొత్త సినిమా పోస్టర్ ఔట్

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఆర్76 తెరకెక్కుతున్నసంగతి తెలిసిందే. సుధాకర్ చెరుకూరి భారీగా ఈ సినిమాను ప్లాన్ చేసారు. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాకి 'భర్త మహాశయులారా' టైటిల్ అనుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే సోమవారం ఈ సినిమా టైటిల్ విడుదల చేయడానికి టైం ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ లోపే టైటిల్ సగం చెప్పి చెప్పకుండా పోస్టర్స్ లీక్ చేసారు. టైటిల్ చూస్తే.. మొత్తానికి 'భర్త మహాశయులారా' టైటిల్నే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఓ పాట కోసం ప్రత్యేకమైన సెట్ వేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందుతున్న అదిరిపోయే డ్యాన్స్ నంబర్ చిత్రీకరిస్తున్నారు. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకి సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ ప్రసాద్ మూరెళ్ళ. నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్.

# యువ హీరో శర్వానంద్ తాజా చిత్రం బైకర్




అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటిస్తున్న చిత్రం బైకర్. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీరు బైకర్ స్పీడ్ ఎలా ఉందో చూశారు. ఇక ఇప్పుడు ప్రెప్పీ మెలోడీ టైం వచ్చేసిందంటూ.. ఫస్ట్ సింగిల్ ప్రోమో అప్‌డేట్ లుక్ విడుదల చేశారు. హెల్మెట్ పెట్టుకున్న హీరోయిన్‌తో రొమాంటిక్ మూడ్‌లో ఉన్న శర్వానంద్ స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ పాట ప్రోమోను నవంబర్ 11న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. గిబ్రాన్ మ్యాజికల్ ఆల్బమ్‌ను రెడీ చేస్తున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్.. ఇక్కడ ప్రతీ బైకర్‌కు ఓ కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ.. చావుకు ఎదురెళ్లే కథ.. అంటూ సాగే వాయిస్‌తో ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ బైక్ రేసుతో సాగుతుంది. ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ అంటూ బైక్ రేసింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్దంగా ఉండండి.. అంటూ శర్వానంద్ టీం ఇప్పటికే బైకర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బైకర్‌లో డాక్టర్ రాజశేఖర్ శర్వానంద్ తండ్రి పాత్రలో కనిపించనుండగా బ్రహ్మాజి, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.


## ప్రేమంటే మూవీ నుంచి పెళ్లి షురూ పాట విడుదల




ప్రియదర్శి, ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే' శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్‌మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు.వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రాఘవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.

# దుమ్మురేపుతున్న చిరు, చరణ్‌లు

## తండ్రీకొడుకుల పోటాపోటీ పాటల డ్యాన్స్‌లు





ఒకప్పుడు హీరోల మధ్య పోటీ ఉండేది. ఒక హీరో చేసిన కథ, పాట,, ÷ట్ హిట్టయితే అలాంటిదే తమ హీరో కూడా చేయాలని అభిమానులు కోరుకునేవారు. అందుకు తగ్గట్టే హీరోలు, దర్శకులు ఆయా సన్నివేశాలను డిజైన్ చేసుకునేవారు. ఇప్పుడు సొంతవారి నుంచే పోటీ ఎదురవుతోంది. అటు చిరంజీవి , ఇటు రామ్‌చరణ్ తమ కొత్త చిత్రాల్లోని పాటలతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు. పోటీ మాట ఎలా ఉన్నా, మెగా అభిమానులు మాత్రం ఆనందంలో తేలియాడుతున్నారు.అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు' . నయనతార కథానాయిక. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర ప్రచారంలో భాగంగా విడుదల చేసిన 'మీసాల పిల్ల సాంగ్ యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం, ఉదిత్ నారాయణ్ గాత్రానికి చిరంజీవి గ్రేస్ తోడవడంతో ఈ పాట ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే 50 మిలియన్ వ్యూస్‌తో దూసుకుపోతోంది. సాంగ్‌ను ఎంజాయ్ చేస్తూ డ్యాన్స్ చేయడంలో చిరంజీవి ఆయనకు ఆయనే సాటి. తెరపై ఆ గ్రేస్ చిరులో మాత్రమే చూడగలం. తండ్రి బాటలోనే పయనిస్తూ అదరగొడుతున్నారు రామ్‌చరణ్. ఆయన కథానాయకుడి గా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పెద్ది'. జాన్వీకపూర్ కథానాయిక. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ నుంచి 'చికిరి.. చికిరి' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఇందులో చరణ్ వేసిన స్టెప్ సోషల్‌మీడియాను ఊపేస్తోంది. చిన్నా, పెద్దా వయసుతో సంబంధం లేకుండా దీన్ని రీక్రియేట్ చేసి, పంచుకుంటున్నారు. అతి తక్కువ సమయంలోనే ఈ పాట 50 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకోవడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది ప్రేక్షకుల ముందుకురానుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613